ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు

శుక్రవారం 18 జూలై 2025



చీనీచెట్లకు ట్యాంకర్లతో నీళ్లు అందిస్తున్న రైతు

కరువు మేఘం

- ఖరీఫ్‌కు గడ్డుపరిస్థితులు
- 6.5 శాతమే పంటల సాగు
- తేమలేక ఎండుతున్న మొక్కలు
- పశుగ్రాసానికీ తప్పని ఇక్కట్లు
- మెట్టసాగుపై అన్నదాతల ఆశలు ఆవిరి





గత ఏడాది ఖరీఫ్ పంటలు అంతంత మాత్రమే చేతికి అందాయి. ఈ ఏడాదైనా గట్టెక్కుదామని రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. జూన్ నెల మొదటి వారంలో జిల్లాలో రుతుపవనాలు ప్రవేశించినా చినుకు కరువైంది. రోజులు గడుస్తున్నా వర్షం కురవక రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని సాగు విస్తీర్ణంలో అత్యధికం వర్షాధారంతోనే సాగు అవుతోంది. ఇందులో ఖరీఫ్ సీజన్ ముఖ్యమైంది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం కింద 77,475 హెక్టార్లకు గాను.. ఇప్పటి వరకు 6,941 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగు కావడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

కడప రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై కరువు మేఘం కమ్ముకుంది. ఖరీఫ్‌కు గడ్డుపరిస్థితులు దాపురించాయి. ఖరీఫ్ సీజన్ జూన్ 1 నుంచి సెప్టెంబరు వరకు ఉంటుంది. సీజన్ ప్రారంభమై సగం కాలం పూర్తయింది. ఇప్పటి వరకు 6.5 శాతమే పంటలు సాగయ్యాయి. అవి కూడా వర్షంలేక ఎండిపోతున్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా పడతాయని వాతావరణశాఖ చెప్పుకొచ్చింది. ఇప్పటికి 50 రోజులు అవుతున్నా మబ్బులు కమ్ముకోవడం తప్ప వానకురవడం లేదు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రైతుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి.

అడుగంటిన భూగర్భ జలాలు

ఇప్పటికే గ్రామాల్లో తాగునీటి సమస్య మొదలైంది. పలు గ్రామాలకు నాలుగురోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తున్నారు. వర్షం జాడలేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. జూన్ నెల 68.2 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కాగా.. కేవలం 22.8 శాతం మాత్రమే నమోదైంది. జూలై నెలలో 96.7 సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 7.1 శాతం మాత్రమే నమోదైంది. ఈ కారణంగా జిల్లాలోని చెరువులు, కుంటల్లో చుక్కనీరులేక వెలవెలబోతున్నాయి. పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడుతోంది. కొద్దిరోజుల్లో వర్షాలు కురవకపోతే మూగజీవాలకు మేత సమస్య తీవ్రరూపం దాల్చనుంది.

25 మి.మీ వర్షం పడితేనే..

గత ఏడాది ఖరీఫ్‌లో అసమతుల్య వర్షాల కారణంగా పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 77,475 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యం కాగా జూలై 14 నాటికి వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం 6,941 హెక్టార్లలో మాత్రమే విత్తనం పడింది. ఆ విత్తనం కూడా అంతంత మాత్రం తేమలోనే వేయడంతో సరిగా మొలకెత్తలేదు. మొలకెత్తిన వీ తరువాత వాన లేకపోవడంతో ఎదగలేదు. ఇప్పటి వరకు వేరుశనగ, పత్తి, మినుము, కంది, ఆముదం, మొక్కజొన్న వంటి పంటలను సాగుచేశారు. ఇవన్నీ కూడా ప్రస్తుతం ఎండిపోతున్నాయి. జూలైలో 17 రోజులు గడిచినా కేవలం 7.1 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే నమోదైంది. ఈ వర్షపాతానికి విత్తనం వేయడం సాధ్యం కాదు. కనీసం 25 మిల్లీమీటర్లు నమోదైతేనే విత్తే అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 94 శాతం విత్తనం భూమిలో పడకపోవడతో మళ్లీ కరువు ఛాయలు నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వారం పదిరోజుల్లో వర్షాలు కురవకపోతే ఖరీఫ్ కష్టమే అంటున్నారు.

ప్రధాన పంటల సాగు హెక్టార్లలో..

పంట	అంచనా	సాగు
వరి	30,804	1571.43
మొక్కజొన్న	932	717.43
సజ్జ	1,089	358
మినుము	3,806	827
పత్తి	24,036	2,429
వేరుశనగ	5,976	870



వానల్లేక బోరుబావుల్లో నీళ్లు అడుగంటడంతో వాడుతున్న చీనీచెట్లు

ఎండుతున్న చీనీ తోటలు

వీరపునాయునిపల్లె, జూలై 17(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి చీనీ పంటలు ఎండుతున్నాయి. ఒకపక్క వర్షాభావం మరోపక్క భూగర్భజలాలు అడుగంటిపోవడంతో రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఖరీఫ్ ప్రారంభమై ఒకటిన్నర నెల దాటినా వానల్లేక పోవడంతో వ్యవసాయ బోర్లలో అరొకరగా వచ్చే నీళ్లు కూడా తగ్గి చీనీ చెట్లు ఎండుదశకు చేరుకున్నాయి. పులివెందుల నియోజకవర్గంలో చీనీతోటలు ఎక్కువ. ఒక్క వీరపునాయునిపల్లె మండలం తలపనూరు గ్రామంలోనే దాదాపు 200 ఎకరాల్లో చీనీతోటలు సాగులో ఉన్నాయి. ఇవన్నీ ప్రస్తుతం వాడుమొగం పట్టాయి. వరుణుడు కరుణించకపోతాడా అని రైతులు చీనీచెట్లకు ట్యాంకర్లతో నీటి తడులు అందిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1700 వెచ్చించి నీటిని తెప్పించుకుంటున్నారు. మండలంలో సర్వరాయసాగర్ జలాశయం ఉన్నా.. సాగునీటిని అందించే పిల్లకాల్వలు పూర్తికాకపోవడంతో వ్యవసాయ బోర్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

ట్యాంకర్లతో నీళ్లు తోలుతున్నాం

ఐదు ఎకరాలు సాగుచేశాను. వర్షంలేక చెరువుల్లోకి నీరురాకపోవడంతో బోర్లలో నీళ్లు తగ్గిపోయాయి. చీనీ చెట్లు వాడుతున్నాయి. ఐదు రోజులుగా ట్యాంకర్లతో నీళ్లు తోలి చీనీచెట్లను కాపాడుకుంటున్నాం. మా గ్రామానికి పడమర భాగాన సర్వరాయసాగర్ నీళ్లు ఏడాదిలో పది నెలలు వృథాగా పోతున్నాయి. ఈనీటిని తూర్పు వైపు మళ్లిస్తే సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందుతుంది. తాగునీటి సమస్యా తీరుతుంది.

- రామలక్ష్మిరెడ్డి, చీనీ రైతు, తలపనూరు, వీఎన్‌పల్లె మండలం

రిమ్స్ సూపర్‌స్పెషాలిటీలో
నర్సుపై లైంగికదాడి యత్నం

కడప సెవెన్ రోడ్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో (రిమ్స్) ఉన్న సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి స్టాఫ్‌నర్స్‌పై లైంగికదాడి యత్నం జరిగింది. కంచే చేను మేసిన చందాన భద్రతను పర్యవేక్షించాల్సిన సెక్యూరిటీ సూపర్వైజరే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితుల కథనం మేరకు.. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి బుధవారం రాత్రి రెండు గంటల సమయంలో సెక్యూరిటీ సూపర్వైజర్ మద్యం సేవించి యూనిఫామ్ లేకుండా ప్రవేశించాడు. రాత్రి విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సుపై లైంగికదాడికి ప్రయత్నించడంతో ఆమె గట్టిగా కేకలు వేశారు. గాఢనిద్రలో ఉన్న రోగులు ఒక్కసారిగా అరుపులు వినపడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. అందరూ అరవడంతో దుండగుడు ఆసుపత్రి పైఅంతస్తుకు వెళ్లి దాక్కున్నాడు. వైద్య సిబ్బంది, రోగుల బంధువులు కలిసి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి అవుట్‌పోస్టు పోలీసులకు అప్పజెప్పారు. ఈ సంఘటన గురించి ఆసుపత్రిలో సెక్యూరిటీని పర్యవేక్షిస్తున్న కాంట్రాక్టర్ బాలనారాయణరెడ్డిని వివరణ కోరగా అతడిని ఉద్యోగం నుంచి తొలగించామని చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విచారణకు ఆదేశించామని, నిజానిజాలు పూర్తిగా తెలుసుకున్నాక చర్యలు తీసుకుంటామని అన్నారు. దీనిపై రిమ్స్ పోలీస్‌స్టేషన్ సీఐ సీతారామిరెడ్డిని వివరణ కోరగా.. ఈ ఘటనపై తమకు సమాచారం ఉందని, అయితే ఇంతవరకూ ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. అయినా తాము హెడ్ కానిస్టేబుల్‌ను పంపించి విచారణ చేయిస్తున్నామన్నారు.

బంగారు గొలుసుల దొంగ అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులు

కడప క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళలే టార్గెట్‌గా బంగారు గొలుసు లు చోరీ చేస్తున్న దొంగను అరెస్టు చేసి 152 గ్రాములు గల బంగారు చైన్లు, ఒక హీరో హోండా స్పెండర్ ప్లస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు మండలం దేవగుడికి చెందిన పట్టనేతి నవీన్ (26) ఆటో తోలుకుంటూ చెడు వ్యసనాలకు బానిసై ఈజీ మనీ కోసం గొలుసు దొంగతనాలకు పాల్పడ్డాడన్నారు. కడప రూరల్ సీఐ చల్లనిదొర, పెండ్లిమర్రి ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో ఈనెల 2వ తేదీన నవీన్‌ను అరెస్టు చేసి ఆ తరువాత 1.150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకని జైలుకు పంపించారన్నారు. అనంతరం 16వ తేదీన కోర్టు అనుమతితో అతడిని కస్టడీకి తీసుకుని విచారించగా ఆరు కేసుల్లో దొంగతనాలకు పాల్పడినట్లు రుజువైందన్నారు. ఇతడి దగ్గర నుంచి 152 గ్రాముల బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో
కడప కార్పొరేషన్‌కు మూడవస్థానం

కడప ఎర్రముక్కపల్లె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2024 ఫలితాల్లో కడప నగరపాలక సంస్థ మరోసారి దేశవ్యాప్తంగా తన ప్రత్యేకతను చాటుకుంది. రాష్ట్రస్థాయిలో కడప కార్పొరేషన్‌కు మూడవస్థానం లభించగా జాతీయస్థాయిలో 31వ ర్యాంకు సాధించింది. 2023లో రాష్ట్రస్థాయిలో 6వ స్థానం లభించగా జాతీయస్థాయిలో 8వ ర్యాంకు ఓడీఎఫ్++ గుర్తింపు సాధించింది. అలాగే 2024లో రాష్ట్రస్థాయిలో 3వ స్థానం సాధించగా జాతీయస్థాయిలో 31వ ర్యాంకు కైవసం చేసుకుంది. ఓడీఎఫ్++ గుర్తింపు నిలుపుకుంది. మరింత శుభ్రమైన, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు తమ పాత్రను పోషించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి కోరారు.

ప్రభుత్వ సేవలపై సంతృప్తి పెంపొందాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలపై ప్రజాస్పందనల సంతృప్తి స్థాయిని పెంపొందించే విధంగా అందరూ పనిచేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. గురువారం రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ హాజరయ్యారు. చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జీరో పావర్టీ, పి-4 పాలసీ, బంగారు కుటుంబాలు, మార్గదర్శుల గ్రామ సభలు, జనాభా నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. నియోజకవర్గాల వారీగా ఎంఎస్ఎం పార్కుల స్థల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ సర్వీసులు, చెత్త సేకరణ, ఆర్టీసీ సర్వీసులు, రేషన్ పంపిణీ, దీపం 2.0 తదితర సేవలపై ఐవీఆర్ఎస్ ద్వారా సేకరిస్తున్న ప్రజా స్పందనపై ఆయా జిల్లాల వారీగా సమీక్షించారు. ప్రతి నెలా మూడో శనివారం నో ప్లాస్టిక్ క్యాంపెయిన్ కార్యక్రమాలపై అవగాహన పెంచాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ సేవలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందేలా అధికారులు క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేయాలన్నారు. బద్వేలు నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు స్టోన్ ఫౌండేషన్ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకంలో భాగంగా జిల్లాలో మిగిలి ఉన్న గ్రామాలను కవర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీసీవో హజరత్తయ్య, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, కేఎంసీ కమిషనర్ మనోజ్ రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్రమణ్యం, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వీడని బాలిక హత్య కేసు మిస్టరీ

- మళ్లీ గండికోటకు పోలీసు అధికారులు



హత్యస్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జమ్మలమడుగు / ప్రొద్దుటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గండికోటలో హత్యకు గురైన బాలిక వైష్ణవి కేసు మిస్టరీగా మారింది. ఈ హత్య కేసులో గుట్టు ఇప్పటికీ వీడలేదు. మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డీఎస్పీలు ఇక్కడకు వచ్చారు. బుధవారం డీఐజీ కోయ ప్రవీణ్ సైతం గండికోటకు వచ్చి బాలిక హత్యకు గురైన స్థలాన్ని పరిశీలించారు. నిందితుల ఆధారాలు దొరికాయని రాత్రి 9గంటల లోగా వివరాలు వెల్లడిస్తామని అన్నారు. కానీ బుధవారం రాత్రి ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఈ హత్యకేసులో ఇంకా మిస్టరీ వీడకపోవడంతో గురువారం మధ్యాహ్నం మరోమారు పోలీసు అధికారులు గండికోటకు వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది తనిఖీలు చేపట్టారు. బాలిక హత్యకు సంబంధించిన ఆధారాల సేకరణ కోసం జమ్మలమడుగు, ప్రొద్దుటూరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ప్రత్యేక బృందాలుగా గాలిస్తున్నారు. కాగా.. బాలిక హత్య ఘటనపై ఏపీ రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ స్పందించింది. బాలిక హత్యకు కారణాలపై సమగ్రంగా దర్యాప్తు చేసి మూడురోజుల్లోపు నివేదిక సమర్పించాలని జిల్లా అధికారులను కమిషన్ ఆదేశించింది.

వైష్ణవి కుటుంబ సభ్యుల విచారణ

గురువారం సాయంత్రం ప్రొద్దుటూరు త్రీటౌన్ పోలీసు స్టేషన్లో వైష్ణవి సోదరులు కొండయ్య, సురేంద్రను పోలీసులు విచారించారు. వీరి నుంచి హత్యకు సంబంధించి ఆధారాలను సేకరించేందుకు యత్నిస్తున్నారు. ఏదిఏమైనా వైష్ణవి హత్య కేసులో నిందితులెవరో శుక్రవారానికైనా పోలీసులు వెల్లడిస్తారా లేదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

తిరుపతి-చర్లపల్లె మధ్య వీక్లీ రైలు

కడప ఎర్రముక్కపల్లె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-చర్లపల్లె-తిరుపతిలకు కడప మీదుగా ప్రత్యేక వీక్లీ రైలును (నెంబర్074 81/074 82)నడపనున్నట్లు కడప రైల్వేసీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. ఆగస్టు 3 నుంచి 24వ తేదీ వరకు తిరుపతిలో ప్రతి ఆదివారం రాత్రి 9.10నిమిషాలకు రైలు బయలు దేరుతుందన్నారు. రాత్రి 10.43కు రాజంపేట, 11.24కి కడపకు చేరుకుంటుందన్నారు. అర్ధరాత్రి 12.18కి ఎర్రగుంట్ల, తాడిపత్రికి 1.18కి చేరుకుంటుందన్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్లమీదుగా కాచిగూడకు సోమవారం ఉదయం 10.05కు వెళ్తుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం 12గంటలకు చర్లపల్లె చేరుకుంటుందన్నారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో ఆగస్టు 4 నుంచి ఆగస్టు 25 వరకు చర్లపల్లెలో ప్రతి సోమవారం రాత్రి 7.20కి బయలుదేరి అదేరోజు రాత్రి 8.15కు కాచిగూడ చేరుకుంటుంది. మహబూబ్‌నగర్ మీదుగా ఎర్రగుంట్లకు మంగళవారం తెల్లవారుజామున 4.38కి, కడపకు 5.23కు, రాజంపేటకు 6.28కి, 9.30కు తిరుపతి చేరుకోనుందన్నారు.

కొండపోరంబోకు భూములు స్వాధీనం

- హెచ్చరిక బోర్డు ఏర్పాటు
- విద్యుత్ సరఫరా తొలగించాలని ఆదేశం
- భూముల్లోకి దిగితే క్రిమినల్ కేసులు : ఆర్డీవో



అనధికారికంగా ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమౌళి



ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో సిబ్బంది ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

కాశినాయన, జూలై 17(ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలం నాయనపల్లె సమీపంలో ఆక్రమణకు గురైన 294 ఎకరాల ప్రభుత్వ కొండపోరంబోకు భూములను స్వాధీనం చేసుకున్నామని బద్వేలు ఆర్డీవో చంద్రమౌళి తెలిపారు. నాయనపల్లె సమీపంలోని సర్వే నెంబర్ 129-1, 130, 217లలో ఆక్రమణకు గురైన 294 ఎకరాల ప్రభుత్వ కొండపోరంబోకు భూములను తహశీల్దారు వెంకటసుబ్బయ్యతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఆక్రమణకు గురైన భూముల్లో ఇప్పటికే అరటి తోటలు, అనధికారికంగా లాగిన కరెంట్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఈ భూములను మూడు దఫాలుగా ఆర్డీవో చంద్రమౌళి, ఒకసారి జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో గురువారం తుదివిడత పరిశీలన అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ.. గతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా లెక్కచేయకుండా కొంతమంది ప్రభుత్వ భూములు ఆక్రమించడంతో పాటు అనధికారికంగా కరెంట్ లైన్లు లాగి, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్నట్టు గుర్తించామన్నారు. జాయింట్ కలెక్టర్ వచ్చి పరిశీలించి వెళ్లిన తర్వాత ఇటీవల మరో 10 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఇందులో కొన్ని జలకళ బోర్లు కూడా ఉన్నట్లు తేలిందన్నారు. సాధ్యమైనంత తొందరలో ప్రభుత్వ భూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని ట్రాన్స్‌కో సిబ్బందిని ఆదేశించామన్నారు. ప్రస్తుతం ఆక్రమిత కొండ పోరంబోకు భూముల్లో దాదాపు 40 ఎకరాల్లో అరటి సాగుచేశారు. ఈ భూముల చుట్టూ ఎక్స్‌కవేటర్‌తో కాలువ కొట్టాలని ఆర్డీవో ఆదేశించారు. ఈ భూముల్లోకి ఎవరైనా దిగి సాగుకు ఉపక్రమిస్తేతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇకపై ఈ భూములు ఆక్రమణకు గురైతే రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీటీ రవిశంకర్, ఆర్ఐ అమరనాథరెడ్డి, మండల సర్వేయర్ సుచిత్ర, వీఆర్వో జాస్విని, సర్వేయర్ స్వరూప్, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

సింధనూరు నుంచి తిరుమలకు పాదయాత్ర

- రోజుకు 50 కిలోమీటర్ల నడక



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న సింధనూరు భక్తులకు స్వాగతం పలుకుతున్న ఎర్రగుంట్ల వాసులు

ఎర్రగుంట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని సింధనూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న భక్తులు గురువారం ఎర్రగుంట్లకు చేరుకున్నారు. వీరికి ఎర్రగుంట్ల తిరుమల పాదయాత్ర కమిటీ బృందం, స్వామివారి భక్తులు మేళతాళాలతో నాలుగు రోడ్ల కూడలి వద్ద స్వాగతం పలికారు. ఎర్రగుంట్లలో వారికి అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సింధనూరు భక్తుల బృందం గురుస్వామి పంపాపతి మాట్లాడుతూ 23సంవత్సరాలుగా తాము 150మందితో పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. మూడు సంవత్సరాలుగా ఎర్రగుంట్లలో డాక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో తమకు అల్పాహార విందు ఏర్పాటు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. మరో నాలుగురోజుల్లో తాము తిరుమల చేరుకుని స్వామిని దర్శించుకుంటామన్నారు. రోజుకు సుమారు 50కిలో మీటర్ల మేర నడక సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు గోవిందుని భజనలతో అందరినీ భక్తిపారవశ్యంలో ముంచారు.

విషద్రావణం సేవించి వ్యక్తి ఆత్మహత్య


అమరనాథ్‌రెడ్డి

పెద్దమండ్యం, జూలై 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి మద్యంలో విషద్రావణం కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పెద్దమండ్యం మండలంలో జరిగింది. పోలీసులు, గ్రామ స్థుల కథనం మేరకు.. పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీ రెక్కల కొండకు చెందిన అమరనాథ్‌రెడ్డికి గుర్రంకొండ మండలం సంగసముద్రం గ్రామ పంచాయతీ యల్లంవారిపల్లికు చెందిన రెడ్డెమ్మతో పదిహేనేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు వున్నారు. మేస్త్రీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబ పోషణ కొన్నేళ్లు సాఫీగా సాగింది. హైదరాబాదు, బెంగుళూరు పట్టణాల్లో మేస్త్రీ కూలీ పనులు చేశారు. రెండేళ్ల క్రితం మదనపల్లి తట్టివారిపల్లిలో వారు నివాసం వుంటున్నారు. ఈ క్రమంలో అమరనాథ్‌రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మధ్యాహ్నం స్వగ్రామమైన రెక్కలకొండ పల్లికు అమరనాథ్‌రెడ్డి (37) వచ్చాడు. అదే రోజు మధ్యాహ్నం మద్యంలో వాస్మోల్ కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అతని అమ్మ సుబ్బలక్ష్మీని బెదిరించాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో రాయచోటి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు రెఫర్ చేశారు. అసుపత్రికి తరలించగా అదే రోజు సాయంత్రం 5 గంటలకు మృతి చెందాడు. మృతుడి భార్య రెడ్డమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

మహిళ మృతి...


వైష్ణవి (ఫైల్‌ఫొటో)

చిన్నమండెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం దేవళంపేటకు చెందిన దేరంగుల వైష్ణవి (22) బుధవారం సాయంత్రం విషద్రావణం తాగడంతో మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకెళ్లినట్లు తెలిపారు. గురువారం ఉదయం హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటూ మృతి చెందింది. ఈమె 20 రోజులు ముందు చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి భర్త మీద కంప్లైంట్ ఇచ్చింది. వాళ్ల భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కంప్లైంట్ ఇచ్చింది. ఎస్‌ఐ సుధాకర్ కౌన్సెలింగ్ ఇచ్చి పంపించాడని మృతురాలికి 18 నెలల పాప, ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉంది. వాళ్ల తల్లి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గడ్డివామికింద పడి ఇద్దరు..


మృతి చెందిన శ్రీరాములురెడ్డి, శంకర్‌రెడ్డి

రామసముద్రం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వర్షానికి తడవకుండా ఉండడానికి ఓ ఇద్దరు వ్యక్తులు పొలంలోని ఓ గడ్డి వామి కిందకు వెళ్లగా వామి మీద పడడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. మృతుల కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని నారిగానిపల్లెకు చెందిన శ్రీరాములురెడ్డి (70), ఆల్విపల్లెకు చెందిన శంకర్‌రెడ్డిలు బుధవారం ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని మామిడి తోట నుంచి వస్తుండగా ఒక్కసారిగా వర్షం ప్రారంభమైంది. వర్షానికి తడవకుండా ఉండేందుకు సమీపంలోని గంగాధర్ పొలంలో ఉన్న గడ్డివామి కిందకి వెళ్లారు. అదే సమయంలో గాలి వాన తాకిడికి గడ్డి వామి ఒక్కసారిగా కూలిపోయి శ్రీరాములురెడ్డి, శంకర్‌రెడ్డిలపై పడడంతో ఊపిరాడక వారు అక్కడికక్కడే మరణించారు. మృత్యువు వాన రూపంలో వచ్చి వృద్ధుల ఆయువు తీసిందని మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు...


మృతిచెందిన సుబ్రమణ్యం

నందలూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటూరు గ్రామ పంచాయతీ ఎగువ కుమ్మర పల్లె గ్రామంలో గురువారం సాయంత్రం మారం సుబ్రమణ్యం(64) అనే వృద్ధుడు విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. మృతుని కుమారుడు మారం శంకరయ్య వివరాల మేరకు.. తన తండ్రి సాయంత్రం ఆరు గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి నీటితొట్టి వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై మృతిచెందినట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


ఐసీడీఎస్ 'కుక్కర్ల' కేసులో

సీడీపీవో రమాదేవికి ఊరట

కలికిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంచలనం కలిగించిన ఐసీడీఎస్ ప్రెజర్ కుక్కర్ల కుంభకోణం కేసులో దోషులుగా తేలిన ముగ్గురు సీడీపీవోల్లో గతంలో లక్కిరెడ్డిపల్లెలో పనిచేసి, ప్రస్తుతం సీకేదిన్నె ప్రాజెక్టు సీడీపీవోగా ఉన్న రమాదేవికి ఊరట దక్కింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట చేయడానికి ఉద్దేశించిన ప్రెజర్ కుక్కర్ల కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ప్రెస్టేజ్ బ్రాండు కాకుండా నాసిరకం కుక్కర్లు కొనుగోలు చేసి పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి కొంతమంది సీడీపీవోలు పాల్పడిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి దాదాపు పదేళ్లుగా అనేక విచారణ దశలు దాటుకుని చివరకు అప్పట్లో కడప సీడీపీవోగా పనిచేసిన వి.అరుణకుమారి, లక్కిరెడ్డిపల్లె సీడీపీలో వి.రమాదేవి, సిద్దవటం సీడీపీవో పి.నిర్మలను దోషులుగా నిర్ధారిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 23 ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీని పైన అప్పటి లక్కిరెడ్డిపల్లె.. ప్రస్తుతం సీకే దిన్నె ప్రాజెక్టు సీడీపీవోగా పనిచేస్తున్న వి.రమాదేవి తాను నిర్దోషురాలంటూ గత నెల 19న ప్రభుత్వానికి అప్పీలు చేసుకుంది. లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టుకు సంబంధించి ప్రెస్టేజీ కంపెనీ బదులుగా నాసిరకానికి చెందిన 5 లీటర్లతో 337, 7.5 లీటర్లతో మరో 337 సరఫరా జరిగిన మాట వాస్తవమే అయినా తిరిగి నాసిరకం కుక్కర్ల బదులుగా ప్రెస్టేజీ కంపెనీ కుక్కర్లు తెప్పించినట్లు తన అప్పీలులో రమాదేవి పేర్కొంది. తాను జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిగా పదోన్నతి పొందేందుకు అర్హురాలిగా వున్నానని, ప్రభుత్వం దోషిగా నిర్ధారించిన కారణంగా తనకు పదోన్నతి అవకాశం లేకుండా పోతుందని తెలుపుకుంది. దీంతో మానసిక వేదన తోపాటు, ఆర్థికంగా కూడా నష్టపోతానని విన్నవించింది. ఈ అప్పీలులోని పూర్వాపరాలను పరిశీలించిన ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఉత్తర్వును రద్దుపరిచి రమాదేవిని నిర్దోషిగా ప్రకటిస్తూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అత్యాశకు పోయి మోసపోయారు

- అంకెల రాత పేరుతో బురిడీ...
- నమ్మిన పాపానికి నడిరోడ్డున పడ్డారు
- జిల్లాలో 5 వేల మందికి పైగా బాధితులు



రూ.3వేలు డిపాజిట్‌తో పొందిన మెంబర్‌షిప్ కార్డు

కురబలకోట, జూలై 17(ఆంధ్రజ్యోతి): మనిషికి ఉన్న అవసరాల మేరకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను ఆర్జించవచ్చనే అత్యాశకు పోయి మోసపోయారు. మనిషికి ఉన్న డబ్బు అవసరాలు ఎదుటి వారి మాయమాటలకు గుడ్డిగా నమ్మి సొమ్ములను పోగొట్టుకుంటున్నారు. నిత్యం ఇలాంటి మోసాలను తరచూ ఏదో ఒక చోట చూస్తూనే ఉన్నాం. కాగా ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్, వివిధ రకాల యాప్‌లలో మోసపోయిన వారిని మనం రకరకాల మాధ్యమాల ద్వారా చూస్తూనే ఉన్నాం. అయితే వాటికి భిన్నంగా కొంత మంది కొత్త అవతారమెత్తి కొత్త రకపు అక్రమ వసూళ్లు చేసి మోసానికి పాల్పడ్డారు. మనిషికి ఉన్న ఆశను ఆధారంగా చేసుకుని ఎలైట్ క్రీవ్స్ డేటా సొల్యూషన్స్ సంస్థ పేరుతో భారీ స్థాయిలో దోపిడీకి పాల్పడ్డ కొత్త రకం మోసం వెలుగులోకి వచ్చింది. ఈ సంస్థ ద్వారా అంకెల రాత పేరుతో అమాయక ప్రజలను బురిడీ కొట్టించి భారీస్థాయిలో డబ్బులు కాజేశారు. ఈ సంస్థ మోసాలు కురబలకోట మండలం అంగళ్లలో వెలుగు చూసింది. దీంతో జిల్లాలోని మదనపల్లె, పీలేరు, చింతామణి తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు బయటపడింది. గత కొద్ది రోజులు క్రితం కర్ణాటకకు చెందిన ఒక వ్యక్తి ఎలైట్ క్రీవ్స్ డేటా సొల్యూషన్స్ సంస్థను ఏర్పాటు చేశారు. అతడు బెంగళూరులో అక్కడే ఉంటూ కార్యకలాపాలను సాగిస్తున్నాడు. తన చేతికి మట్టి అంటకుండా స్థానికంగా ఉన్న కొంతమందికి ఆ సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పించారు. స్థానికంగా మొబైల్ షాప్ నిర్వహించే దుకాణదారుడు, అతని సమీప బంధువు ఈ సంస్థను ఆ కార్యకలాపాలను చూసుకునేవారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

రూ.3 వేలతో మెంబర్షిప్

ఈ సంస్థలో చేరేవారు ఒకసారి రూ.3వేలు చెల్లించి మెంబర్‌షిప్ పొందాల్సి ఉంటుంది. దానికి గానూ ఆ సంస్థలో పని చేసేవారు వారికి కొన్ని పేపర్లు ఇస్తారు. ఆ పేపర్లకు గానూ అదనంగా మరో 200 చెల్లించాల్సి ఉంటుంది. ఆ పేపర్లలో 10 నుంచి 30 వరకు అంకెలు రాస్తే రూ.15, 31-60 వరకు రాస్తే రూ.20, 61-80 వరకు రాస్తే రూ.25, 81-90వరకు రాస్తే రూ.30, 91-100 వరకు రాస్తే రూ.50 చెల్లిస్తారు. అలాగే కొన్ని సందర్భాల్లో 1001 నుంచి 1500 వరకు, 1501 నుంచి 2000 వరకు రాయాల్సి ఉంటుంది. మెంబర్‌షిప్ పొందిన వారికి 100 పేపర్లు ఇస్తారు. వీటిని పూర్తి చేస్తే రూ.5 వేలు చెల్లిస్తారు. అలా ఆశ పడి అంగళ్లు చుట్టుపక్కలకు చెందిన సుమారు 500 మందికి పైగా డిపాజిట్ చెల్లించి మెంబర్షిప్ పొందారు. మొదట్లో కొంతమంది అంకెలు రాసి తీసుకెళ్లిన పేపర్లకు డబ్బులు చెల్లించారు. అనంతరం ఏదో ఒక చిన్నచిన్న తప్పులను చూపుతూ డబ్బులు చెల్లించకుండా మోసం చేసేవారు. అంతేకాకుండా ఇందులో మెంబర్‌షిప్ పొందిన వారు తిరిగి ముగ్గురిని అందులో జాయిన్ చేపిస్తే వారికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున రూ.3వేలు చెల్లిస్తామని ఆశ చూపడంతో చైన్‌లింక్ స్కీమ్‌లా పాకింది. దీంతో కొంతమంది డబ్బులను సంపాదించడంతో వాళ్లే దీనిపై ప్రచారం చేశారు. దీంతో నమ్మి చాలా మంది ఈ స్కీమ్‌లో చేరారు. గత కొద్ది రోజులుగా తప్పుల పేరుతో డబ్బులు చెల్లించకుండా మోసానికి పాల్పడటంతో తాము మోసపోయామని బాధితులు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది. జిల్లా వ్యాప్తంగా 5 వేల మందికి పైగా ఈ సంస్థలో మెంబర్‌షిప్ పొందినట్లు పలువురు చెబుతున్నారు. కాగా ముదివేడు స్టేషన్ పరిధిలో ఇప్పటిదాకా 180 మంది దాకా బాధితులు ఫిర్యాదు చేయగా మరికొంతమంది గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. కాగా గురువారం రూరల్ సీఐ సత్యనారాయణ అంగళ్లలోని సంస్థ వద్దకు చేరుకుని విచారించి ఆ సంస్థకు సంబంధించిన పలు రకాల పత్రాలను తీసుకుని, అక్కడ పని చేస్తున్న సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఇలాంటి వాటిని నమ్మొద్దు

- దిలీప్‌కుమార్, ఎస్‌ఐ

డబ్బుల కోసం ఆశ చూపి నట్టేట ముంచేసే సంస్థలను నమ్మి మోసపోకండని ఎస్‌ఐ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశాం. బాధితులకు న్యాయం చేసి ఆదుకుంటాం. అత్యాశకు పోయి మోసపోవద్దని ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇంకా ఇలాంటి సంస్థలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

నిర్వాహకుడిపై కేసు నమోదు

మండలంలోని అంగళ్లు కదిరి రోడ్డులో నిర్వహిస్తున్న ఎలైట్ క్రీవ్స్ డేటా సొల్యూషన్స్ సంస్థ పేరుతో భారీ స్థాయిలో దోపిడీకి పాల్పడ్డ నిర్వాహకుడిపై ముదివేడు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే వీటికి సంబంధించి స్థానికంగా ఉన్న కొందరు ప్రోత్సాహంతో సంస్థలో మెంబర్‌షిప్ పొందామని వారిపై కేసులు నమోదు చేయకపోవడంతో పలు రకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పీలేరులోనూ 'అంకెల' బాధితులు

- రాత్రికి రాత్రే తిప్పేసిన బోర్డు

పీలేరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): అంగళ్లలో వెలుగుచూసిన ఎలైట్ క్రూస్ డేటా సొల్యూషన్స్ సంస్థ మోసాలు పీలేరులోనూ బయటపడ్డాయి. గడిచిన రెండు నెలలుగా ఆ సంస్థ పీలేరులోనూ తమ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిసింది. పీలేరు మండలంతో పాటు పొరుగున ఉన్న కేవీపల్లె, కలికిరి, చిత్తూరు జిల్లా రొంపిచెర్ల, సదుం, తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన సుమారు వేయి మంది ఆ సంస్థలో చేరడమే కాకుండా చైన్ లింక్ తరహాలో తమ స్నేహితులు, బంధువులను కూడా చేర్పినట్లు తెలిసింది. అంగళ్లు, కురబలకోట ప్రాంతానికి పలువురు తాము మోసపోయినట్లు గ్రహించి బుధవారం అక్కడి ఆ సంస్థ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టడం, పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో పీలేరులోని నిర్వాహకులు బుధవారం రాత్రి నుంచి తమ కార్యాలయం మూసివేశారు. అంగళ్లు ఘటన పత్రికల్లో రావడంతో పీలేరు ప్రాంత బాధితులు కూడా గురువారం ఉదయం పీలేరు కోటపల్లె క్రాసులోని ఆ సంస్థ కార్యాలయానికి చేరుకోగా తాళం వేసి ఉండడంతో తాము కూడా మోసపోయినట్లు గ్రహించారు. దీంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆ సంస్థ ప్రతినిధుల ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్ వస్తుండడంతో చేసేది లేక పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మధ్యతరగతి వారే అధికులు

ఎలైట్ క్రూస్ డేటా సొల్యూషన్స్ సంస్థ సాగించిన మోసంలో మధ్యతరగతి వారే అధికంగా ఉన్నారు. గృహిణులు, కళాశాల విద్యార్థినులు, చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్న వారు ఎక్కువ మంది ఉండగా పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేస్తున్న వారు కూడా మోసపోయినట్లు తెలుస్తోంది. దినవారీ స్టాకు రిజిష్టర్ మెయింటెన్స్ కోసం తాము అందించిన షీట్లలో అంకెలు నింపడమే ఉపాధి అని, వర్క్ ఫ్రం హోం తరహాలో ఇంటి పట్టునే ఉంటూ నెలకు రూ.15 వేల దాకా సంపాదించుకోవచ్చని నిర్వాహకులు నమ్మబలికారు. తమ సంస్థలో చేరేందుకు రూ.3050ల డిపాజిట్ చెల్లించాలని ప్రారంభంలో చెప్పిన నిర్వాహకులు ఆ తరువాత చైన్ మార్కెటింగ్‌కు తెరలేపారు. తమ సంస్థలో ఇతరులను చేర్పిస్తే చేర్పించిన వారికి రూ.వెయ్యి ఇన్సెంటివ్ ఇస్తామని చెప్పడంతో చాలా మంది తమ స్నేహితులు, బంధువులు, పొరుగు వారిని కూడా ఆ సంస్థలో చేర్పించారు. బుధవారం మధ్యాహ్నం కూడా కలికిరి ప్రాంతానికి చెందిన పలువురు మహిళలు తమ బంధువులను చేర్పించినట్లు సమాచారం. గురువారం ఉదయం ఆ కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో మోసపోయామని వారు లబోదిబోమంటున్నారు.


ఎలైట్ సంస్థ అందించిన కార్డులు చూపుతున్న మహిళలు

ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్


రాయచోటి(కలెక్టరేట్), జూలై17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన నియోజకవర్గాల్లో భూమి కేటాయింపు జరగాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో పీ-4 పాజిటివ్ పీపుల్ పర్స్పెషన్, ఎంఎస్‌ఎంఈ పార్కులు, ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన, స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీ-4 కార్యక్రమంలో ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శలతో మ్యాప్ చేసే ప్రక్రియ జరుగుతోందని, జిల్లాలో గుర్తించబడిన బంగారు కుటుంబాల అవసరాల గుర్తింపు తదితర ప్రక్రియలను త్వరగా పూర్తి చేసి మ్యాప్ చేయాలన్నారు. జనాభా నిర్వహణపై ప్రభుత్వ విధానాలపై తయారు చేసేందుకు ప్రజల నుంచి తీసుకున్న అభిప్రాయాలను సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రపంచ బ్యాంకు చేయూతతో నిర్వహిస్తున్న ర్యాంప్ ప్రాజెక్టులో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ సేవలు పంచాయతీరాజ్ సేవలు, రేషన్ పంపిణీ, దీపం 2.0, ఏపీఎస్‌ఆర్టీసీ సేవలపై ప్రజల నుంచి తీసుకున్న అభిప్రాయాలను సమీక్షించుకొని ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ పనులకు ఉపయోగకరంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జెన్ చాట్ బాట్ ప్రాజెక్టుకు సహకరించేలా చర్యలు చేపట్టాలని సీపీవోను ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ధ్వంసంపై ఎస్సీ కమిషన్ నోటీసు

- బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, జూలై 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె సమీపంలోని బుద్దునికొండలో బుద్ధుని విగ్రహం ధ్వంసం కేసులో జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) తీవ్రంగా పరిగణించిందని బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 11న భారతీయ అంబేడ్కర్ సేన(బాస్)తో కలసి సమతా సైనిక్‌దళ్ చేసిన ఫిర్యాదును పరిశీలించిన కమిషన్, గురువారం ఎస్పీకి నోటీసు జారీ చేసిందన్నారు. ఈ ఘటనపై సంపూర్ణ నివేదికను 30 రోజులోపు సమర్పించాలని, లేదంటే ఆర్టికల్ 338 ప్రకారం కమిషన్‌కు కల్పించిన న్యాయ అధికారులు వినియోగించి సమన్లు జారీ చేసే అవకాశం ఉందని కమిషన్ నోటీసులో పేర్కొన్నట్లు శివప్రసాద్ వివరించారు. అలాగే బుద్దునికొండలో జరిగింది కేవలం విగ్రహ ధ్వంసం మాత్రమే కాదని, ఇది బౌద్ధుల ఆధ్యాత్మిక గౌరవం మీద జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఇందులో సక్రమంగా స్పందించని, చర్యలు చేపట్టని పోలీసులపై కేసులు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయంగా మిట్స్ కళాశాల



మిట్స్ కళాశాల, (ఇన్‌సెట్లో) కరెస్పాండెంట్ విజయభాస్కర్ చౌదరి

కురబలకోట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్) ఇంజనీరింగ్ కళాశాలకు భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ 1956 యుజీసీ చట్టంలోని సెక్షన్-3 ప్రకారం డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందినట్లు కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి తెలిపారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని కళాశాలలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలోనే కేంద్ర ప్రభుత్వ తొలి డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయంగా అవకాశాన్ని సాధించామన్నారు. కళాశాలను 1998లో మదనపల్లె సమీపంలో ప్రారంభించి 2002లో కురబలకోట మండలం అంగళ్లు సమీపంలో 30 ఎకరాల సువిశాల ప్రాంగణంలో సొంత భవనంలో ప్రారంభించి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సౌకర్యాలను కల్పించామన్నారు. కళాశాలకు నాక్ ఏ ప్లస్, అటానమస్, అక్రిడేషన్ గుర్తింపులు సాధించడంతో పాటుగా ప్రపంచ సహకారాలు, ఇంటర్ డిసిప్లినరి పరిశోధనలు, ఫలితాల ఆధారితలో విద్యా ప్రయాణంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపును సాధించామన్నారు. ఈ కొత్త హోదాలో మెరుగైన విద్యా ప్రమాణాలను అందివ్వడంతో పాటు అంతర్జాతీయ సంబంధాలను ఏర్పాటు చేసుకుని నూతన ఆవిష్కరణలను సృష్టించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ గుర్తింపు అధ్యాపకులు, విద్యార్థుల నిరంతర ప్రయత్నాలకు నిదర్శనమన్నారు. ప్రపంచస్థాయి అభ్యసన వాతావరణాన్ని పెంచి పరిశ్రమలకు తగ్గట్టుగా అవసరయ్యే గ్రాడ్యుయేట్‌లను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందివ్వడమే తమ ధ్యేయమన్నారు. కాగా కళాశాలలో దాదాపుగా 9 వేల మందికి పైగా విద్యభ్యసిస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో సీఎస్‌ఈ, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఏఐఎంఎల్, డేటా సైన్స్, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ కోర్సులు పీజీ నందు ఎంసీఏ, ఎంబీఏ, ఎంటెక్ నందు సీఎస్‌ఈ, వివిల్‌ఎస్‌ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా కళాశాలకు డీమ్డ్ బిటు విశ్వవిద్యాలయంగా గుర్తింపు రావడంతో సంబరాలు చేసుకున్నారు.

నీటమునిగిన వ్యక్తి మృతదేహం లభ్యం


గాలింపు చర్యలు పరిశీలిస్తున్న సీఐ బాబు, నరేష్ (ఫైల్‌ఫొటో)

ఒంటిమిట్ట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిల బ్యాక్‌వాటర్‌లో నీటమునిగిన తోడేటి నరేష్ (29) మృతదేహం గురువారం ఉదయం లభ్యమైంది. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని దవంతరంపల్లె గ్రామానికి చెందిన నరేష్ గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ప్రాంతంలో గొర్రెలకు మేత తగ్గడంతో మండలంలోని సోమశిల బ్యాక్‌వాటర్ ప్రాంతమైన బందర్‌పల్లె గ్రామానికి మూడు రోజుల క్రితం గొర్రెలతో వెళ్లాడు. బుధవారం మధ్యాహ్నం తన గొర్రెలకు మందులు తాపించి చేతులు శుభ్రం చేసుకునేందుకు బ్యాక్‌వాటర్‌లోకి వెళ్లగా బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు నీటమునిగిపోయాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. గురువారం సీఐ బాబు ఆధ్వర్యంలో తిరిగి గాలింపు చర్యలు చేపట్టారు. బ్యాక్‌వాటర్ మధ్యలో మృతదేహాన్ని కనుగొన్నారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కడపకు తరలించారు. మృతునికి భార్య, 8 నెలల కుమార్తె ఉన్నారు. నరేష్ మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యవసాయ ఏడీఏల బదిలీల్లో మార్పులు

కలికిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ జరిగిన బదిలీల్లో పెద్ద ఎత్తున మార్పులు చేస్తూ గురువారం ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ జేడీఏ, డీడీఏ, ఏడీఏలను పెద్ద సంఖ్యలో బదిలీలు చేస్తూ ఆదేశాలిచ్చింది. అయితే అందులో ఒక జేడీఏ, నలుగురు డీడీఏలు, 24 మంది ఏడీఏల బదిలీల్లో మార్పులు చేస్తూ తాజాగా ఉత్తర్వులిచ్చింది. గతంలో నెల్లూరు జిల్లా శిక్షణ కేంద్రం నుంచి కడప ఏడీఏగా బదిలీ చేసిన ఏడీఏ జి.లక్ష్మీమాధవి ఉత్తర్వులను మార్చి తాజాగా ఉదయగిరి ఏడీఏగా బదిలీ చేశారు. బద్వేలు ఏడీఏగా బదిలీ అయిన కె.రామమోహన్‌రెడ్డిని ముద్దనూరు ఏడీఏగా, మైదుకూరుకు బదిలీ చేసిన వి.వెంకటసుబ్బయ్యను బద్వేలు ఏడీఏగా మార్చారు. వాల్మీకిపురానికి బదిలీ చేసిన కవితను చిత్తూరు జిల్లా నగరి ఏడీఏగా నియమించారు. అయితే వాల్మీకిపురానికి ఏడీఏగా ఎవరినీ నియమించలేదు. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మార్పుల జాబితాను ప్రకటించారు.

పోలీసులకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

రాజంపేట టౌన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో పనిచేస్తున్న ప్రతిఒక్కరూ ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ క్యాంపులో పోలీసులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీఎన్ రాజు, డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

చిచ్చరపిడుగు... ఈ బుడతడు

- పొట్టి వాడైనా.. మహా ఘటికుడు
- అనర్గళంగా ఆరుభాషలు మాట్లాడుతాడు..
- ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించాడు
- గూగుల్‌తో కలిసి పనిచేయడమే లక్ష్యం



చదువుకుంటున్న బుడతడు సనత్‌కుమార్

వేంపల్లె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పొట్టివాళ్లు మహా గట్టివాళ్లు అంటారు. ఈ బాలుడి ఎత్తు రెండున్నర అడుగులు. నాలుగేళ్ల తర్వాత జన్యులోపం బయటపడింది. ఏళ్లు గడుస్తున్నా ఎదుగుదల లేకపోయింది. దీంతో ఆత్మన్యూనతా భావంతో బయటకు వెళ్లలేకపోయాడు. తల్లిదండ్రులు చదువుకుంటే భవిష్యత్తు ఉంటుందని హిత బోధ చేయడంతో ఈ బుడతడు చదువుపై ఆసక్తి పెంచుకున్నాడు. 10వ తరగతిలో 89 శాతం మార్కులతో పాసయ్యాడు. ఇప్పుడు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించాడు. ఇక ఈ బాలుడికి అపార మేథస్సు ఉంది. అనర్గళంగా ఆరు భాషలు మాట్లాడగల డు. గూగుల్ సంస్థ ద్వారా అవార్డు పొంది స్కాలర్‌షిప్ తీసు కుంటున్నాడు. ఈ బుడతడి గురించిన ఆసక్తికర వివరాల్లోకి వెళితే...

అనంతపురం పట్టణానికి చెందిన లక్ష్మీప్రసాద్, పల్లవి క్యాటరింగ్ కూలీలుగా పనిచేస్తున్నారు. వీరికి సనత్‌కుమార్, హర్ష కుమారులు సంతానం. 2009లో సనత్‌కుమార్ జన్మించగా తర్వాత కొద్ది సంవత్స రాలకు హర్ష పుట్టాడు. సనత్‌కుమార్‌కు మూడు నాలుగేళ్ల వయస్సు వరకు శరీరంలో ఎదుగుదల ఉండేది. తర్వాత వయసు పైబడుతున్నా ఎదుగుదల లేక పోవడంతో డాక్టర్లను సంప్రదించగా.. జన్యులోపం వల్ల ఎదుగుదల లేదని చెప్పారు. దీంతో మొదట్లో ఆత్మన్యూనతా భావంతో ఇంటి నుంచి బయటకు వెళ్లేవాడు కాదు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంద ధైర్యం చెప్పారు. దీంతో చదువుకునేందుకు ఆసక్తి కనబరిచాడు. ఇక సర్వశిక్ష అభియాన్ అధికారి రామ్ బాలుడిని ప్రోత్సాహించారు. దీంతో విజయవాడ సమీపంలోని పెనమలూరు వికలాంగ విభాగం పాఠశాలలో చదువుకున్నాడు. 10వ తరగతిలో 500/444 మార్కులు సాధించాడు. ఈ మార్కులతో ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటీలో సీటు లభించగా గురువారం జాయిన్ అయ్యాడు.



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో తల్లిదండ్రులతో కలసి అడ్మిషన్ ఫైల్ అందుకుంటున్న సనత్‌కుమార్

అనర్గళంగా ఆరు భాషలు

ఈ బుడతడు మహా తెలివైన వాడు. అనర్గళంగా ఆరు భాషలు మాట్లాడగలడు. యూట్యూబ్ ద్వారా ఉర్దూ, హిందీ నేర్చుకు న్నాడు. తల్లి ద్వారా తెలుగు, ఇంగ్లీష్, కన్నడ, పూర్వీకులు మరాఠి అయినందున ఆ భాషను అనర్గళంగా మాట్లాడుతున్నాడు. ప్రస్తుతం ట్రిపుల్‌ఐటీలో చేరిన ఈ చిచ్చరపిడుగుకు మంచి భవిష్యత్తు ఉంటుందని అక్కడి అధికారులు తెలిపారు.

గూగుల్‌తో కలిసి పనిచేయడమే లక్ష్యం

సనత్‌కుమార్ 8వ తరగతి చదివే సమయంలో గూగుల్ ఆన్ లైన్‌లో పోటీ పరీక్షలో పాల్గొన్నాడు. ఢిల్లీకి వెళ్లి అవార్డుతో పాటు స్కాలర్‌షిప్ పొందాడు. ఇపుడు ట్రిపుల్ ఐటీలో చేరాడు. ట్రిపుల్ ఐటీలో వచ్చిన అవకాశంతో ఇంజనీరంగ్ పూర్తిచేసి గూగుల్ సంస్థతో కలిసి పనిచేయడమే లక్ష్యమని ఆ బుడతడు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

బదిలీలు పొందిన ఉపాధ్యాయుల వేతనాలు వెంటనే చెల్లించాలి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరి గిన టీచర్ల బదిలీలలో పొజి షన్ ఐడీలు లేని కారణంగా బదిలీలు పొందిన సగం మంది టీచ ర్లకు జూన్ నెల వేతనాలు చెల్లించలేదని, వెంటనే ఆ జీతాలు చెల్లించ డానికి చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు ఎ.శ్యామ్‌సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక డీఈవో కార్యాలయంలో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ జూన్ నెలలో జరిగిన బదిలీల్లో బది లీలు పొంది రిలీవర్లు రాని కారణంగా పాత పాఠశాలలోనే పనిచేస్తున్న ఉపా ధ్యాయులందరినీ వెంటనే రిలీవ్ చేసి నూతన పాఠశాలకు పంపించాలన్నారు. ఎంఈవో కార్యాలయాల్లో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యా యులపై, సంబంధిత ఎంఈవోలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పదో తరగతి మూల్యాంకన పరీక్షలు, మూల్యాంకన విధులలో పాల్గొన్న సిబ్బందికి వెంటనే పారితోషికం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాష, శ్రీనివాసరెడ్డి, పూర్వ జిల్లా అధ్య క్షుడు గురయ్య, జిల్లా కౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, నరసింహులు, గురయ్య, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను విమర్శించే అర్హత సతీష్‌రెడ్డికి లేదు : ఎమ్మెల్సీ

పులివెందుల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను విమ ర్శించే అర్హత వైసీపీ నాయకుడు సతీష్‌రెడ్డికి లేదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్సీ తన ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడును, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను సతీష్‌రెడ్డి పదేపదే విమర్శిస్తున్నారన్నారు. విమర్శలు గుప్పించే ముందు మీస్థాయిని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈరోజు జగన్ మెప్పు కోసం పదేపదే విమర్శలు చేయడం అది మీకే చెల్లిందన్నారు. 2005లో వేల్పుల సింగిల్‌విండో ఎన్నికల సమయంలో జరిగిన కాల్పుల ఘటనను అప్పుడే మరచిపోయావా అని ఆయ న విమర్శించారు. అందుకు సంబంధించిన కేసులో ఇప్పటికి మేము కోర్టుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ రాఘవరెడ్డి, టీడీపీ నాయకులు తొండూరు రమణారెడ్డి, మైసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పీఆర్ ఇంజనీర్ల ఇంక్రిమెంట్లు కోత

- జమ్మలమడుగు సీసీ రోడ్ల నిర్మాణాల్లో అక్రమాల ఫలితం

కలికిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ముగ్గురు పంచా యతీ రాజ్ ఇంజినీర్ల ఇంక్రిమెంట్లలో కోత విధిస్తూ ప్రభుత్వం గురువారం ఆదే శాలు జారీ చేసింది. జమ్మలమడుగు మండలం పెద్ద దండులూరు కొత్త ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లలో కొలతలు, నాణ్యత విషయాల్లో తీవ్రమైన అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. ఉపాధి హామీ పథకంలో మంజూరయిన ఈ సీసీ రోడ్ల పై అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు విజిలెన్స్ గుర్తించి 2017 ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీని పైన అప్పట్లో దీనిపై విచారణ నిర్వహించిన కడప పీఆర్ సర్కిల్ ఎస్‌ఈ అక్రమాలు వాస్తవమేనని పేర్కొంటూ నివేదిక అందజేశారు. అప్పట్లో మొత్తం రూ.7,50,980ల మేరకు అవినీతి జరిగినట్లు తేల్చా రు. మొదట్లో అక్రమాలకు కారకులుగా మొత్తం ఐదుగురు ఇంజినీ ర్లను బాధ్యులుగా గుర్తించారు. ఆ పైన ఇంజినీర్లు పంపుకున్న వివరణలు, సంజాయిషీల అనంతరం తాజాగా ముగ్గురు ఇంజి నీర్లను పూర్తి బాధ్యులుగా నిర్ధారిస్తూ ప్రభుత్వం వారి వార్షిక ఇంక్రిమెంట్లలో కోత విధించింది. అప్పటి జమ్మలమడుగు పంచాయతీ రాజ్ డీఈఈ (ప్రస్తుతం ప్రొద్దుటూరు డీఈఈ) టి.గోపాల్‌దాస్, జమ్మలమడుగు మండల ఇంజినీరింగ్ అధికారి కెస్.విజయభాస్కర్ రెడ్డి (ప్రస్తుతం జమ్మలమడుగు ఇన్‌చార్జీ డీఈఈ), జమ్మలమడుగు పీఆర్‌ఐ సబ్ డివిజన్ డీఈఈ పి.వెంకట రావు (ప్రస్తుతం కమలాపురం పీఆర్‌ఐ డీఈఈ)లను ఈ అక్ర మా ల్లో దోషులుగా నిర్ధారించి వార్షిక ఇంక్రిమెంట్లు కోత విధించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూ షణ్ కుమార్ ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు కార్లు పంటలు పండేలా సాగునీరిస్తాం..

- ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి



కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు, ప్రవహిస్తున్న నీరు

వల్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల ప్రభు త్వమని, ప్రతి రైతు రెండు కార్లు పంటలు పండించేలా సాగునీరు అం దిస్తామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లె డ్యాం నుంచి కేసీ కెనాల్‌కు నీటిపారుదల శాఖ అధికారులు, రైతులతో కలిసి నీటిని వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దూరదృష్టితో రైతుల కోసం కృషి చేస్తు న్నారన్నారు. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గంలో 13వేల ఎకరాలకు సాగు నీరందిస్తామని, అలాగే కేసీ కెనాల్ ద్వారా ఆయ కట్టు రైతులు సుమారు 7500 ఎకరాలకు పైగా పంటలు సాగ య్యేందుకు నీటిని అందిస్తున్నామని అన్నారు. కడపలో జరిగిన మహానాడులో జీఎన్ఎ స్ఎస్ కాల్వకు సంబంధించిన పనులు చేస్తే తమ నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని సీఎం చంద్రబాబునాయుడుకు తెలుపగా ఆయన పరిశీలించి వెయ్యి కోట్లకు పైగా నిధులు కేటాయిస్తామని భరోసా ఇచ్చారన్నారు. కేసీ కెనాల్ పూడికతీత పనుల కోసం దాదాపు కోటి రూపాయలకు పైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. రైతులు దిగులు చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఎకరాకు సాగునీరు అంది స్తామని తెలిపారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కేసీ కెనాల్ డీఈ చిన్నపుల్లయ్య, ఏఈ గంగిరెడ్డి, వల్లూరు, చెన్నూరు మండల టీడీపీ అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మదన్‌మో హన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, సుబ్బారెడ్డి, నాగసుబ్బారెడ్డి, శివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వెనుకంజలో కడప, అనంతపురం జట్లు



చెన్నకేశవ, కిరణ్‌కుమార్, అలెన్‌లియో

కడప స్పోర్ట్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్ టోర్నమెం టులో భాగంగా గురువారం రెండు వేర్వేరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. అందులో తమ ప్రత్యర్థి జట్లపై కడప, అనంతపురం జట్లు వెనుకంజలో వున్నాయి. వివరాలిలా..

ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచు కుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటి ఇన్నిం గ్స్‌లో 65.3 ఓవర్లలో 157 పరుగులకే కుప్పకూలింది. ఇందులో రుత్విక్‌కళ్యాణ్ 40 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో కడప జట్టు బౌలర్ చెన్నకేశవ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమ యానికి 24 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేసింది. దీంతో కడప జట్టు మరో 103 పరుగుల వెనుకంజలో వుంది.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి 59.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో అలన్‌లియో 61 పరుగులు, సుశాంత్ 42 పరు గులు చేశారు. అనంతపురం బౌలర్ కిరణ్‌కుమార్ 5 వికెట్లు పడ గొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. దీంతో అనంతపురం జట్టు మరో 131 పరుగుల వెనుకంజలో వుంది.

గుర్తు తెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి



కాశీప్రసాద్ మృతదేహం

పెండ్లిమర్రి, జూలై 17 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని యోగి వేమన యూని వర్శిటీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలగిరి వెంకట కాశీప్రసాద్ (54) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూద న్‌రెడ్డి తెలిపారు. ప్రసాద్ తన స్వగ్రా మం నందిమండలం నుంచి బుధవా రం రాత్రి ద్విచక్రవాహనంపై కడ పకు వెలుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతని తల కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కడప రిమ్స్ ఆసు పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందా డు. మృతుడికి భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పులివెందుల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండలం లోని అగ్రహారం గ్రామానికి చెందిన సాకే అమర్‌నాథ్ (40) అనే రైతు అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... పంటల సాగుకోసం పలువురు ప్రైవేటు వ్యక్తుల వద్ద దాదాపు రూ.15లక్షల మేర అమర్‌నాథ్ అప్పులు చేశాడు. పంటలు సరిగా పండక పోవ డం, చేసిన అప్పులు తీరకపోవడంతో అప్పుల తెచ్చిన వారి దగ్గర నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. దీంతో మనస్థాపం చెంది ఈనెల 9వ తేదీ విషద్రావణం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్తను హత్య చేసిన కేసులో ఇరువురు అరెస్టు

కడప క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎర్రముక్క పల్లెకు చెందిన సుబ్బరాయుడును హత్య చేసిన కేసులో అతడి భార్య హర్షిత, బావమరిది హరిక్రిష్ణను అరెస్టు చే సినట్లు వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. ఎర్రముక్కపల్లెకు చెందిన సుబ్బరాయు డు టైల్స్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. పదేళ్ల క్రితం అక్క కూతురు హర్షితను వివాహం చేసుకున్నాడు. సుబ్బరాయుడు మద్యం తాగి తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడని, ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి గొడవ పడుతుండగా ఆమె తన అన్నతో కలిసి గట్టిగా తోయడంతో తలకు తీవ్ర గాయమై చనిపోయినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇరువురుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఒప్పంద అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకు పనిచేసిన అర్హులైన ఒప్పంద అధ్యాపకులు 2025-26 విద్యా సంవత్సరానికి రెన్యువల్స్ కోసం ఈనెల 19వ తేదీలోపు పని చేస్తున్న సంబంధిత కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆర్ట్సకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్లు, ఎస్ఎస్‌సీ ధ్రువీకరణపత్రం జతచేయాలని ఆయన కోరారు.

ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దండి

- రాజులగురువాయపల్లె నుంచే పీ4
- విద్యాభివృద్ధి బాధ్యత ప్రజలదే..
- జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్



విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న డీఈవో షంషుద్దీన్

ముద్దనూరు జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాజు లగురువాయపల్లె గ్రామ ప్రజలు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట వేస్తున్నారని, కా న్వెంట్ రహిత గ్రామంగా ముందుకు సాగ డం ఎంతో శుభపరిణామమని జిల్లా విద్యా శాఖాధికారి షంషుద్దీన్ అన్నారు. సీఎం చం ద్రబాబునాయుడు ఆశయం పీ4 అనే ఆలోచ నకు రాజులగురువాయపల్లె నుంచే శ్రీకారం చుట్టడం పట్ల గ్రామ ప్రజలను ఆయన అభి నందించారు. పీ4 మార్పులో భాగంగా మం డల పరిధి రాజులగురువాయపల్లె ప్రాథమి క, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురు వారం డీఈవో సందర్శించారు. అందులో భా గంగా ముందుగా డిజిటల్ తరగతి గదులకు వెళ్లి పరిశీలించారు. విద్యార్థులకు కొన్ని ప్రశ్న లు వేశారు. పిల్లలు సమాధానం చెప్పడంతో అభినందించారు. తరువాత ఎస్ఎంసీ సభ్యు లు, పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావే శం నిర్వహించారు. అందులో భాగంగా ఆ యన మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి ముందుకు రావ డం ఎంతో శుభపరిణామమన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పిల్లలు లేకమూతపడ్డ ప్రాథమిక పాఠశాల పునర్ ప్రారంభమయ్యి ందన్నారు. దీంట్లో గ్రామవాసి వెంకటరమణ, ఉపాధ్యాయుడు రవిశంకర్ కృషి ఉందన్నా రు. గ్రామ ప్రజలు పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా గ్రామం నుం చే కాకుండా చుట్టుప్రక్క గ్రామాల నుంచి కా న్వెంట్‌కు వెళ్లే పిల్లలను ప్రభుత్వ పాఠశాల బాట పట్టించారన్నారు. పిల్లలకు అన్ని వస తులు ప్రజల భాగస్వామ్యంతోనే చేపడుతు న్నారని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగల న్నారు. రాష్ట్రంలో మార్పునకు ఇక్కడ నుంచే రావాలన్నారు. గ్రామ వాసి పావణి స్వచ్ఛంద వలంటీర్‌గా విద్యార్థులకు విద్యాబోధన చేయ డం ఆనందదాయకమన్నారు. కేరళ రాష్ట్రంలో చాలా గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలల బలోపేతం జరుగుతోందన్నారు. 9 నుంచి 4 గంటల వరకు పాఠశాల సమ యం ఉన్నప్పటికీ పిల్లల భవిష్యత్ కోసం ఉ పాధ్యాయులు అదనపు సమయం కేటాయి స్తారని తెలిపారు. ప్రస్తుతం ఉన్నత పాఠశా లలో 134 విద్యార్థులు, ప్రాథమిక పాఠశాల లో 20 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వి ద్యా కమిటీల పర్యవేక్షణ కూడా ఉండాలన్నా రు. కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరనాయ క్, హెచ్ఎం దస్తగిరి, ఎస్ఎంసీ చైర్మన్ రా ముడు, కిరణ్‌కమార్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పి ల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులను రైతులకు విక్రయించాలి

పోరుమామిళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన అను మతి కలిగిన ఉత్పత్తులను మాత్రమే రైతులకు విక్ర యించా లని ఏడీఏ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పోరు మామిళ్లలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకా ణాల్లో కర్నూలు డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, గోవర్ధన్, కడప జేడీఏ కార్యాలయం సహాయ సంచాలకులు, స్థానిక వ్యవసా య సంచాలకులు మురళీధర్‌రెడ్డి, వ్యవసాయాధికారి చంద్ర హాసరెడ్డి కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సంద ర్భంగా ఆయా దుకాణాల్లోని రిజిస్టర్లను తనిఖీ చేసి రికా ర్డులు సక్రమంగా రాయాలని డీలర్లను హెచ్చరించారు. సరైన పత్రాలు లేని వాటిని పరిశీలించి అమ్మకాలను నిలుపుదల చేశారు. ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం అనుసరించి వ్యాపార లావాదేవీలు కొనసాగించాలన్నారు. ప్రతిరోజూ స్టాకు బోర్డు ధరల పట్టికను అప్‌డేట్ చేసి ఉంచాలన్నారు. లైసెన్సు లేకుండా వ్యాపార లాదేవీలు కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బోగాదమ్మ అమ్మవారి గుడిలో చోరీ

కమలాపురం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లెలో ఇటీవల పునర్నిర్మాణం చేసిన బోగాదమ్మ అమ్మవారి గుడిలో చోరీ జరిగిన సంఘటన ఆల స్యంగా వెలుగు లోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. మంగళవారం అర్ధరాత్రి సమయంలో దొంగలు అమ్మవారి ఆలయ తలుపులకు ఉన్న తాళం పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. ఆలయింలోని హుండీని రంపంతో తొలగించి గుడి పక్కకు తీసకెళ్లి అందులో డబ్బును దొంగలించినట్లు తెలిపారు. ఈ విషయం పోలీసులకు తెలిపినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

కడప నాగరాజుపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె. మల్లికార్జునరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి కోరారు. గురువారం ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయంలో చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించడంలో అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు తెలంగాణ తరహా నేరుగా జీతాలు చెల్లించాలని, నగదు రహిత అపరిమిత ఆరోగ్య పాలసీ వర్తింపజేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, మీటర్ రీడర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

కమలాపురం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అనేక సంవత్సరాలుగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 పీఆర్సీ అరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని, అలాగే కొత్త ఆపరేటర్లకు పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రవి, మల్లికార్జునరెడ్డి, దిలీప్, రాజారెడ్డి, నరసింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందుల సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ కడప రోడ్డు ఫీడర్, ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని 11 కేవీ ఫైర్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చీనీ పంటలను పరిశీలించిన డ్వామా పీడీ



పెండ్లిమర్రి, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెర్లోపల్లె పంచాయతీలో ఉన్న చీనీ పంటలను గురువారం డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలను సాగు చేసే రైతులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రోత్సాహకాలను అందిస్తున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి, ఏపీఎం ఓబులమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఉచిత సోయాబీన్ విత్తనాల పంపిణీ



పంపిణీ చేస్తున్న శశిభూషణ్‌రెడ్డి, తదితరులు

రైతులకు సింహాద్రిపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకేసుల రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముద్దనూరు ఎఫ్‌పీవో సంస్థ ద్వారా ఉచితంగా సోయాబీన్ విత్తనాలు పంపిణీ చేశారు. గతంలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఎకరానికి 30 కిలోల మేర ప్రతి రైతుకు ఒక హెక్టారుకు సరిపడ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి, ఎఫ్‌పీవో చైర్మన్ గురుప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, బీజేపీ నాయకుడు లక్ష్మినారాయణరెడ్డి, మండల వ్యవసాయాధికారి కళ్యాణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలో పాపాఘ్నినది తీరప్రాంతాలు

చక్రాయపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలో పాపాఘ్నినది తీరప్రాంతాలు ఆక్రమణకు గురవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన తహసీల్దార్ విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందించారు. పాపాఘ్నినది తీరప్రాంతంలో కొందరు అక్రమంగా పంటలు సాగుచేసే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గాలివీడు నుంచి వేంపల్లె వరకు నదిలో పంటలు సాగు చేస్తున్నారని, దీనితో నది కుంటలా కనిపిస్తోందన్నారు. సాగు చేసిన ఈ పంటలకు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడడం వల్ల స్వచ్ఛమైన పాపాఘ్నినది కలుషితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, రామకృష్ణ, వేమయ్య, బద్రినాథ్, నరేంద్ర, ఆంజనేయులు నాయక్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు అందని వేతనాలు

కమలాపురం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీలోని సుమారు 30 మంది కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు వెట్టిచాకిరి చేయించుకున్నారని, తక్షణం కార్మికుల జీతాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్‌కార్యాలయ ఆవరణంలో మున్సిపల్ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మున్సిపల్ ఆఫీసులో డ్రైవర్లు లేకపోవడంతో స్వీపర్లతోనే ట్రాక్టర్లు నడిపిస్తూ, స్వీపర్లతోనే ఆఫీసు పనులు కూడా చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు 10 నుంచి 12 గంటల పాటు వెట్టిచాకిరి చేయిస్తున్నారని, ఇంతా చేసినా జీతాల విషయంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని వాపోయారు. తక్షణమే కార్మికుల వేతనాలు మంజూరు చేయకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

తీర్పు వచ్చే వరకు అంత్యక్రియలు నిషేధం

లింగాల, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామంలో ఉన్న శ్మశానంలో హైకోర్టు తీర్పు వచ్చే వరకు గ్రామస్థులు ఎవరూ అంత్యక్రియలు నిర్వహించకూడదని తహసీల్దార్ ఈశ్వరయ్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 5ఎ1ఎలో 1.83ఎకరాల భూమి ఉందన్నారు. ఇంత వరకు గ్రామస్థులు శ్మశానానికి ఆ భూమిని ఉపయోగించుకోవడంపై ఓ వ్యక్తి హైకోర్టుకు వెళ్లడంతో విచారణలో ఉందన్నారు. దీంతో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆ భూమిలో అంత్యక్రియలు చేయరాదని, ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

పులివెందుల, జూలై 17(ఆంధ్రజ్యోతి): జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. గురువారం రాత్రి అందిన సమాచారం మేరకు నగరిగుట్ట సాయిబాబా ఆలయం సమీపంలో జూదమాడుతున్న ప్రాంతానికి సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.5540 స్వాధీనం చేసుకున్నామన్నారు.

రేకులషెడ్డు కూల్చినవారిపై చర్యలు తీసుకోండి

కడప మారుతీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): తన పూర్వీకుల కాలం నుండి ఆధీనంలో వున్న రేకులషెడ్డును ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా కార్పొరేషన్ అధికారులు కూల్చివేయడం దారుణమని చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లి గ్రామానికి చెందిన తిరుమలశెట్టి మహేష్ అన్నారు. ఈ మేరకు గురువారం కడపలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేయాలన్న నెపంతో తన ఇంటి వద్ద ఉన్న రూఫ్‌ను కార్పొరేషన్ సిబ్బందితో దౌర్జన్యంగా రేకులషెడ్డును నిట్టనిలువునా కూల్చివేశారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి కూల్చివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధి

సీకేదిన్నె, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని ఈవోఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలు తమ ప్రగతిని చూపించాలని తద్వారా సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధిలో ముందుకు సాగాలన్నారు. మండలాన్ని జిల్లాలోనే ముందువరుసలో ఉంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ శాఖల ప్రణాళికలను చర్చించారు. కార్యక్రమంలో ఉపమండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అరాచకం కోసం వైసీపీ ఎత్తుగడ

- ముస్లింలకు టీడీపీ అండగా ఉంటుంది
- పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

వేంపల్లె, జూలై 17(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం ఘటనలో వైసీపీ అరాచకం సృష్టించేందుకు ఎత్తుగడ వేసిందని, ఇందులో భాగంగానే పోలీస్‌స్టేషన్‌పై దాడి జరిగిందని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. ముస్లిం మైనారిటీలకు టీడీపీ అండగా ఉంటుందని, పక్కీరుపల్లెలో కేసుల భయంతో వెళ్లిపోయిన ధైర్యంగా ఇంటికి రావాలని అన్నారు. పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, స్టేషన్‌పై దాడి చేసిన వారు, వారిని ప్రోత్సహించిన వారిని మాత్రమే శిక్షిస్తారని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన పక్కీరుపల్లెకు వెళ్లి ముస్లిం మహిళలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అంతకుముందు వేంపల్లె ఆర్‌అండ్‌బీ అతిథిభవనంలో జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీచైర్మన్ ఖాద్రి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ తదితరులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాలిక తప్పిపోవడంతో పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. దీనిని అవకాశంగా తీసుకున్న కొన్ని అదృశ్య శక్తులు పులివెందులలో వైఎస్ జగన్ పర్యటన ఉండటంతో అరాచకం, అలజడి సృష్టించాలన్న దురుద్దేశంతో పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారని తెలిపారు. బాలికను చంపేశారని పుకార్లు పుట్టించి స్టేషన్‌లో ఉన్న ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. రెచ్చగొట్టి, ముందుండి, ఆస్తులు ధ్వంసం చేసిన వారిని మాత్రమే పోలీసులు శిక్షిస్తారని మిగిలిన వారు భయపడే అవసరం లేదని బీటెక్ రవి స్పష్టం చేశారు.

పోరాట ఫలితంగానే లెప్రసీ అలవెన్స్ మంజూరు

కడప మారుతీనగర్, జులై 17 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పోరాటాల ఫలితంగానే ఒక్క సంవత్సరపు లెప్రసీ అలవెన్స్‌ను మంజూరు చేసి ఖాతాలకు జమ చేయడం జరిగిందని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేసిన కష్టానికి సకాలంలో అలవెన్స్ ఇవ్వకుండా ఆలస్యం చేయడం సబబుగాలేదన్నారు. ఇంకా మూడు సంవత్సరాల లెప్రసీ అలవెన్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే కరోనా ప్రత్యేక అలవెన్స్ మొత్తం ఇంతవరకూ ఆశాలకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు స్పందించి తక్షణమే మంజూరు చేయాలన్నారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు, ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గురువారం రెండవ డివిజన్ వైఎస్సార్ కాలనీ వాసులు కార్పొరేటర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వీరిని ఎమ్మెల్యే ఆర్.మాధవి, శ్రీనివాసరెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది వైసీపీ కార్పొరేటర్లకు తొత్తులుగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. రేషన్‌కార్డు అడిగితే కార్పొరేటర్ ఇంటికి వెళ్లాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్పొరేషన్‌లో 50 డివిజన్‌లో 50 మంది కూటమి అభ్యర్థులు గెలిస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. మొదట వైఎస్సార్ కాలనీలో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన కాలనీని వైసీపీ నాయకులే అనాథలుగా చేశారన్నారు. కార్యక్రమంలో సూర్యనారాయణరావు, రాజగోపాల్‌రెడ్డి, శ్రీధర్, సిసింద్రి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విభజన హామీల కోసం 'చలో ఢిల్లీ' : డీవైఎఫ్ఐ

కడప సెవెన్ రోడ్స్, జూలై 17(ఆంధ్రజ్యోతి): విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరనాల శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విభజనహామీలను మరచిపోయిందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని, వెనుకబడిన రాయలసీమకు ప్యాకేజీ లేదని, ఉపాధి పరిశ్రమల ఏర్పాటు లేదని, పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు, రాయలసీమకు చేసిన మోసాన్ని ఎండగడుతూ 18న ఢిల్లీలోని జంతర్‌మంతర్ చేస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే ఆదిల్, ప్రసాద్, సురేంద్ర పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో 60మందికి అడ్మిషన్

వేంపల్లె, జూలై 17(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఐటీలో రెండో విడత కౌన్సెలింగ్‌లో 60మందికి అడ్మిషన్ లభించినట్లు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్ అన్నారు. గురువారం రెండో విడత అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించారు. 91 మందికి కాల్‌లెటర్లు పంపగా 60 మంది జాయిన్ అయ్యారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ రమేష్ కైలాష్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ రమేష్, ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి, రాఘవరెడ్డి, నవీన్, లైబ్రేరియన్ కోనప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

సీకేదిన్నె, జూలై 17(ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో మద్దిమడుగు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాంబశివుడు అనే వ్యక్తికి గాయాలైనట్లు తెలిసింది. గువ్వల చెరువు కొత్తపల్లెకు చెందిన సాంబశివుడు పని ముగించుకుని గురువారం రాత్రి ఇంటికి వెళ్తుండగా గుర్రంకొండ నుండి కడపవైపు వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. సాంబశివుడికి కాళ్లు, చేతులకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరం

సీకేదిన్నె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం ఎంతో అవసరమని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లమా మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్యను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి డిప్లమా కోర్సు ఒక వారధిలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి మురళీమోహన్‌నాయక్, హెచ్‌అండ్‌ఎస్ విభాగాధిపతి శశికుమార్, ఈసీ విభాగాధిపతి మురళీకృష్ణ, ఈఈఈ రామమోహన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

క్షయవ్యాధి రహిత సమాజమే లక్ష్యం

- ఎమ్మెల్యే మాధవి



క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే

కడప మారుతీనగర్, జులై 17(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి రహిత జిల్లాగా రూపొందించడమే లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆర్. మాధవి సంబంధిత అధికారులకు సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2027 నాటికి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి నిక్షయ పోషణ యోజన పథకం కింద నెలకు రూ.1000 వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, డాక్టర్ రవిబాబు, డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ రమేష్, డాక్టర్ వరుణ్‌కుమార్, డాక్టర్ రియాజ్‌బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి సమస్య పరిష్కరించేందుకు కృషి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కడప నగరంలోని ద్వారకానగర్‌లో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఇంటింటికీ సంక్షేమం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

వల్లూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఇంటింటికి సంక్షేమం అందుతోందని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మిట్టపల్లె గ్రామంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మేనిఫెస్టోలో అందించిన సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుంటామన్నారు. ఈ సందర్భంగా ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి. టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శివారెడ్డి, రామసుబ్బారెడ్డి, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు చెర్లోపల్లెలో 'సుపరి పాలనలో తొలి అడుగు'

పెండ్లిమర్రి, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెర్లోపల్లెలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హాజరవుతున్నారని, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం : బీటెక్ రవి

వేంపల్లె, జూలై 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలోని శ్రీరామ్‌నగర్‌లో సుపరిపాలనలో తొలిఅడగు-ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 2018 నుంచి పనిచేస్తున్నా కేవలం రూ.25వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారని, పనికి సమాన వేతనం ఇచ్చేలా ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులతో మాట్లాడాలని ట్రిపుల్‌ఐటీ గెస్ట్ ఫ్యాకల్టీ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, షబ్బీర్, మునిరెడ్డి, గెస్ట్‌ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్, లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కందులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న కందులను సద్వినియోగం చేసుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకోవాలని బీటెక్ రవి తెలిపారు. మండలంలోని నందిపల్లె గ్రామంలో రైతులకు గురువారం ఉచిత కందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో శివశంకర్‌రెడ్డి, మండల పరిశీలకుడు రఘునాథ రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల సదస్సును జయప్రదం చేయాలి

సీకేదిన్నె, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై ఈనెల 20న నంద్యాలలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో గురువారం సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లక్షల ఎకరాల వ్యవసాయ భూములను సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. గత ప్రభుత్వం భూసర్వే పేరుతో భూముల రికార్డులను గందరగోళంగా మార్చి రైతులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, మండలాధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, చిన్నసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పులివెందుల, జూలై 17(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి గురువారం పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పులివెందులలోని తన నివాసంలో 39 మందికి మంజూరైన రూ.27,25,081 చెక్కులను ఆయన అందించారు. మూగబోయిన గంగాదేవికి రూ.2.40 లక్షలు, సింహాద్రిపురం మండలం లోమడ గ్రామానికి చెందిన భూమిరెడ్డి చిన్నఓబుళరెడ్డికి రూ.1.62లక్షలు, బలపనూరు గ్రామానికి చెందిన మాచిరెడ్డి ప్రభావతికి రూ.1.62లక్షలు, పులివెందుల పట్టణం తొండూరు లక్ష్మీదేవికి రూ.75వేలు, పొలిమేర ఆదినారాయణరెడ్డి రూ.లక్ష, మరికొందరికి చెక్కులను అందించారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న రామగోపాల్‌రెడ్డి

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



డాక్టర్. ఎన్. హిమబిందు
వైద్యాధికారిణి, ప్రొద్దుటూరు

ముఖాముఖి

ప్రొద్దుటూరు అర్బన్ జులై 17 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేయవచ్చని వైఎంఆర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ హిమబిందు తెలిపారు. వాతావరణం మారుతుంటే మన ఆరోగ్యంపై దాని ప్రభావం చూపించడం సహజమని ఈ నేపథ్యంలో ప్రజలు కొన్ని మెలకువలు పాటించాలని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: వాతావరణం మార్పులతో ఎలాంటి వ్యాధులు వస్తాయి ?

జవాబు: ఎండకాలం నుంచి వర్షాకాలం వైపు మారే సమయంలో వైరల్ ఫీవర్స్, గొంతు నొప్పులు, అలెర్జీలు, జలుబు వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

ప్రశ్న: ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

జవాబు: శుభ్రంగా ఉండే నీటినే తాగాలి. మరగించిన నీటిని తాగడం ఉత్తమం. ఆహారపు అలవాట్లలో మార్పు రావాలి. వేసవిలో ఎక్కువ శీతల పదార్థాలు తినేవారు, వర్షాకాలంలో వాటిని తగ్గించాలి. వేడి ఆహారాలకు ప్రాధాన్యమివ్వాలి.తాజా పండ్లు తీసుకోవాలి.

ప్రశ్న: వ్యాధులు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

జవాబు: దోమల నుంచి ఉపశమనం కొరకు మార్కురైజేషన్, దోమతెరలు ఉపయోగించడం, ఇంటిలో గాని, బయట గాని నీరు నిల్వ ఉండే ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలి. అనారోగ్యంతో ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. వృద్ధులు, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రశ్న: రోగ నిరోధక శక్తి పెంచుకోవడంఎలా ?

జవాబు: రోజు వ్యాయమం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. విటమిన్ సి ఉన్న పదార్థాలను తీసుకోవడం మంచిది. ఉదాహరణకు నిమ్మ, మామిడి, ఉసిరికాయలు తీసుకోవాలి.

బ్రిడ్జి పనుల పరిశీలన

కాశినాయన జూలై17(ఆంధ్రజ్యోతి) పిట్టిగుంట- ఉప్పలూరు గ్రామాల మధ్య సగిలేరు నదిపై నిర్మిస్తున్న వంతెన పనులను గురువారం బద్వేల్ నియోజకవర్గ జనసేన పార్టీ నేతలు పరిశీ లించా రు. పార్టీ ఇన్‌చార్జి బసివి రమేష్ నేతృత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి వాడుతున్న ఇసుక కంకరను పరిశీలించారు. మండల జనసేన నాయకుడు బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాండులేక ఆటోవాలాల ఇక్కట్లు

దువ్వూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దువ్వూరులో ఆటోస్టాండులేక ఆటోవాలాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపక్కనే ఆటోలను నిలుపుతన్నారు. దువ్వూరు గ్రామ పంచాయతీలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. ముఖ్యంగా ఆటోలు, జీపులు నిలబడేందుకు తగిన స్థలం లేక మూడు రోడ్ల కూడలిలో ఇవి నిలుస్తున్నాయి. మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు జనాలను తరలించే నేపథ్యంలో ఇక్కడ రద్దీ అధికంగా ఉంటోంది. మండలంలో 30కిపైగా గ్రామాలకు ఆటోలు, జీపులు నిత్యం నడుస్తుంటాయి. రమారమి 50 ఆటోలు, 30 జీపులు ఇక్కడ కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానికంగా రోడ్లమీద ఆటోలు నిలబడుతున్నాయి. పోలీసు క్వార్టర్స్ స్థలంలో జీపులు ఆగుతున్నాయి. వాటి వలన స్థానికంగా ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ఈ సమస్య కొన్నేళ్లుగా కొనసాగుతున్నా గ్రామ పంచాయతీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని ప్రజలతోపాటు వాహనచోదకులు విమర్శిస్తున్నారు. వారి నుంచిగ్రామ పంచాయతీ రోజువారీగా రుసుం వసూలు చేస్తూ పంచాయతీ సొంత నిధులు సమకూర్చుకోవడం మంచి పద్ధతి అయినా వాహనాలు నిలిపేందుకు స్టాండును ఏర్పాటు చేయకపోవ డం ఏమిటని గేటు డబ్బులు చెల్లించే వ్యక్తులు ప్రశ్నిస్తున్నారు. దువ్వూరు గ్రామ పంచాయతీలో స్థానిక సమస్యలు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



ఆటో స్టాండు లేక రోడ్డు పక్కనే నిలిపిన ఆటోలు

సమావేశంలో సమస్యలపై చర్చిస్తాం

పంచాయతీ సమావేశంలో సమస్యలపై చర్చిస్తామని గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన ఆటోల సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' వివరణకోరగా పై విధంగా స్పందించారు. దినసరి మార్కెట్ బస్టాండు వేలం పాట ద్వారా రూ.3,11,500 సొంత నిధులు సమకూరుతున్నాయని ఇవి జనరల్ ఫండ్ నిధుల్లో జమ అవుతాయన్నారు. వేలంపాట చేపట్టిన చోదకుల వాహనాలు నిలిపే సౌకర్యం ఏర్పాటు చేయలేదని ఎప్పటి నుంచో ఈ ఆనవాయితీ కొనసాగుతోందని పేర్కొన్నారు. పంచాయతీ సమావేశంలో వాటన్నింటిపైన చర్చ జరుపుతామని చెప్పారు.

బాలిక హత్యకు కారకులైనవారిని శిక్షించాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థి ఫెడరేషన్ కార్మిక నాయకులు

జమ్మలమడుగు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం గండికోట శ్రీరంగనాథస్వామి దేవాలయం వెనుక బాలిక వైష్ణవి హత్య కేసుకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, జిల్లా ఐద్వా సంఘం నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఆ మేరకు జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదురుగా నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యాటక ప్రాంతమైన గండికోటలో బాలిక హత్యకు గురికావడం దురదృష్టకరమైన సంఘటన అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రజా సంఘాల నాయకులు, అంగన్వాడీ , యువజన సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

స్కూటరిస్టుకు తీవ్ర గాయాలు

జమ్మలమడుగు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దనూరు రోడ్డు అనంతగిరి గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం తలారి మాణిక్యరాజు తీవ్రంగా గాయపడ్డాడు. జమ్మలమడుగు నుంచి ద్విచక్ర వాహనంలో బయల్దేరి వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు డ్రైవర్ బైకును ఢీకొన్నాడు. ఈ ఘటనలో స్కూటరిస్టు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు ప్రత్యేక వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం ప్రైవేటు ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ



పేద మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న సినీనటుడు రాజ్‌కుమార్

కొండాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామసుబ్బారెడ్డి నగర్‌లోని పేద మహిళలకు సినీనటుడు రాజ్‌కుమార్, ఆయన సతీమణి రమాదేవిలు చీరలను పంపిణీ చేశారు. తన బావమరిది రవీంద్రనాథరెడ్డి జ్ఞాపకార్థం పేద మహిళలకు చీరలను వితరణగా పంపిణీ చేసినట్లు రాజ్‌కుమార్ తెలిపారు. సినీనటుడు కావడంతో రాజకుమార్‌ను చూసేందుకు స్థానికులు తరలివచ్చారు. సీఎం సురేష్‌కుమార్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీ కోసం జాయింట్ సర్వే

ఎర్రగుంట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మున్సిపాలిటిలో మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణం కోసం గురువారం జాయింట్ సర్వే నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శేషఫణి, తహసీల్దార్ శోభన్‌బాబులు దొండపాడు రస్తాలోని వంక సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అలాగే పెద్దనపాడు వద్ద డంపింగ్ యార్డు కోసం సుమారు 4.90ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.

రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ

పోరుమామిళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి) :ఎన్‌డీఏ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా పోరుమామిళ్లలోని ప్రభుత్వ వైద్యశాలలో జనసేన వీరమహిళ శీలంశెట్టి విజయలక్ష్మీదేవి ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, జనసేన సీనియర్ నాయకులు శీలంశెట్టి లక్షుమయ్య, నగరి రమణయ్య, తమ్మిశెట్టి రమణయ్య, బొల్లు వెంకటసుబ్బయ్య, పాతకడప సిద్దయ్య, ఇమ్రాన్‌లతో పాటు వైద్యులు నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు

బద్వేలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి):కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో బలమైన పోరాటాలు నిర్వహిస్తామని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగారు రావు తెలిపారు. గురువారం పట్టణంలోని ఎన్‌జీవోహోంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ ప్రథమ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కార్యదర్శి ఓబయ్య, సభ్యులు చంద్రశేఖర్, ఎ చంద్రమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై అధికారుల దాడులు

బ్రహ్మంగారిమఠం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భరణిక్రిష్ణ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కుళాయప్ప, రవిచంద్ర ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ చౌర్యంపై దాడులు నిర్వహించారు. లైన్‌ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంటు ఇంజనీర్లు, లైన్‌మెన్లు 40 మంది సిబ్బందితో 24 బ్యాచ్‌లుగా గ్రామాలకు వెళ్లి అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్న వారిపై 55 కేసులు నమోదు చేసి రెండు లక్షలకు పైగా అపరాధ రుసుం విధించడం జరిగిందని బి.మఠం అసిస్టెంటు ఇంజనీరు రవికుమార్ తెలిపారు. అనంతరం బ్రహ్మంగారిమఠం సబ్‌స్టేషను వద్ద సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భరణిక్రిష్ణమాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛంధంగా విద్యుత్ వాడుకుని వచ్చిన బిల్లులను సంస్థకు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంటు ఇంజనీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు లైన్‌మెన్లు , జూనియర్ లైన్‌మెన్లు , కాంట్రాక్టు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణులు కవితా ప్రసన్న

దువ్వూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండవచ్చని మానసిక ఆరోగ్య నిపుణులు డాక్టర్ కవితా ప్రసన్న తెలిపారు. పుల్లారెడ్డిపేట జడ్పీ హైస్కూలులో గురువారం మానసిక రుగ్మత అనే అంశంపై అవగాహన కల్పించారు. క్రీడలు, యోగా, ధ్యానంపై విద్యార్థులు ధ్యాస ఉంచాలని సూచించారు. టీవీ, సెల్‌ఫోన్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం లాంటివాటికి దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఎనిమిది గంటలు నిద్రపోవాలని, పరీక్షల్లో ఫెయిల్ అయితే ప్రాణాలమీదకు తెచ్చుకునే చెడు ఆలోచనలు చేయకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో విద్యార్థులతోపాటు వైద్యులు రోష్ని, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, వైద్యసిబ్బంది రాజగోపాల్, మల్లీశ్వరి, శ్రావణి పాల్గొన్నారు.

మంచి ఆహార అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం

బద్వేలు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మంచి ఆహార అలవాట్లు అలవర చుకుని తద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తొట్టిగారిపల్లె వైద్యాధికారి వినయ కుమార్ అన్నారు. మండల పరి ధిలోని నందిపల్లె గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో గురువారం జాతీయ డెంగ్యూ మాసోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోషక విలువ కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని కూల్‌డ్రింక్స్‌ను విడనాడి చిక్కీలు పాలు, గుడ్లు, ఆకుకూరలు వంటి పదార్థాలు తీసుకోవాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ జ్వరాలు వస్తే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంటు జనార్దననవు, సీహెచ్‌వో జ్యోత్స్న, ఏఎన్ఎంలు నాగమ్మ, రాములమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌గా లక్ష్మీదేవి ఏకగ్రీవ ఎన్నిక

చాపాడు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా భూమిరెడ్డి లక్ష్మీదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి హరికృష్ణ తెలిపారు. చాపాడులోని గ్రామ సచివాలయంలో ఉపసర్పంచులు, వార్డుమెంబర్లు చేతులు ఎత్తి ఎన్నుకున్నారు. ఆ గ్రామ వార్డు మెంబర్లు వెంకటసుబ్బమ్మ, ఓబుళరెడ్డి, సుబ్బమ్మ, గురప్ప, రాజేశ్వరి, వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు. భూమిరెడ్డి లక్ష్మీదేవి టీడీపీకి చెందినవారు. ఆ గ్రామ సర్పంచ్ వర్రా స్వాతి కూడా పాల్గొన్నారు. లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మండల టీడీపీ నాయకులు మార్తల నరసింహారెడ్డి హర్షం వెలిబుచ్చారు. మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏడాది పాలనపై ప్రచారం



ప్రభుత్వ సుపరిపాలనపై ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

పోరుమామిళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది సందర్భంగా బద్వేలు యువనేత రితీష్‌రెడ్డి ఆదేశాల మేరకు రంగసముద్రం పంచాయతీలో 78వ పోలింగ్ బూత్ గిరినగర్ కాలనీల్లో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ప్రజలకందిస్తున్న పథకాలపై టీడీపీ నాయకులు, ఎంపీటీసీ కల్వకూరి రమణ, ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు బండి ఓబులేసు, రమేశ్ తదితరులు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేశవ, అజయ్ పాల్గొన్నారు.

ఉచిత న్యాయసేవలను వినియోగించుకోండి

దువ్వూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయసేవలను వినియోగించుకుని కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని మైదుకూరు సివిల్‌జడ్జి ఖాజామైనుద్దీన్ సూచించారు. దువ్వూరు మండలం క్రిష్ణంపల్లె గ్రామంలో గురువారం రాజీమార్గం రాజమార్గం అనే నినాదంతో సదస్సులో ఆయన మాట్లాడుతూ కాలయాపన లేకుండా కోర్టుల చుట్టూ తిరిగే పని లేకుండా న్యాయ సహాయ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు సంజీవరెడ్డి, ఎంపీడీవో రామకృష్ణయ్య, ఎస్ఐ వినోద్‌కుమార్, ఏపీపీ జ్వాలా, ప్యానల్ న్యాయవాదులు శివరామకృష్ణ, శ్రీనివాసులు, అబ్దుల్ వహబ్, ఇమామ్‌బాష, కరిముల్లా పాల్గొన్నారు.

హామీల అమలులో నిర్లక్ష్యం తగదు

బద్వేలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవ హరించడం తగదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బద్వేలులో నిర్వహించిన ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ బకాయిలు, 2025 జూలై నాటికి4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జీవీ.సుబ్బారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బి.మఠం తహసీల్దారుగా కార్తీక్

బ్రహ్మంగారిమఠం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారుగా కె.కార్తీక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో మైదుకూరు తహసీల్దారు రాజనరసింహా నరేంద్ర ఇన్‌చార్జి తహసీల్దారనుగా పనిచేస్తుండేవారు. మండలంలో భూసమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని నూతన తహసీల్దారు కార్తీక్ తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

● డీసీహెచ్ఎస్ హిమదేవి



ప్రభుత్వాసుపత్రిలో తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్ హిమదేవి

బద్వేలుటౌన్, జులై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ హిమదేవి పేర్కొన్నారు. గురువారం బద్వేలు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ హిమదేవి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణ చేసినట్లు తెలిపారు. రోగులకు ప్రభుత్వాసుపత్రికి వ్యయ ప్రయాసలు పడి వైద్యం కోసం వస్తుంటారని, వారికి మెరుగైన వైద్యం కచ్చితంగా అందించాలని ఆమె అన్నారు. విధి నిర్వహణలో ఉండి ఇతర ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కొంత మంది బయట ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేస్తున్నారని, ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు బయట పరీక్షలు నిర్వహించి డబ్బులు వసూలు చేస్తూ వైద్యం అందిస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయని, ఈ నేపథ్యంలో ఆసుపత్రి వైద్యులపై విచారణ చేపట్టామన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పలురికార్డులను, ఫార్మసిషాపును తనిఖీ చేశారు.

ప్రొద్దుటూరు కోర్టు ఏపీపీగా గుర్రప్ప నియామకం

కలికిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది సి.గుర్రప్పను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. మూడేళ్ల వరకూ గానీ లేదా ప్రభుత్వం తొలగించే వరకూ గానీ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. నెలకు రూ.25 వేల వంతున గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు.

కొనసాగుతున్న ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

● కొవిడ్ వర్కర్లు విధుల్లోకి వచ్చేలా కార్మిక నేతల అంగీకారం



కమిషనర్ తో చర్చిస్తున్న కార్మిక నాయకులు సత్యం, విజయ్‌కుమార్

ప్రొద్దుటూరు ,జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తమ న్యాయమైన డిమాండ్లు నేరవేర్చాలని మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం ఐదవ రోజుకు చేరుకుంది. 16 నుంచి పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగటంతో రెండురోజులుగా పట్టణంలో పారిశుధ్య సేవలు పూర్తిగా బంద్ అయ్యాయి. మున్సిపల్ కార్యాలయం నుంచి చెత్త వాహనాలను కూడా కార్మికులు బయటకు రానీయకుండా అడ్డుకోవడంతో పరిస్థితి తీవ్ర రూపం దాల్చింది. దీంతో కమిషనర్ రవిచంద్రారెడ్డి రంగంలోకి దిగి గురువారం ఉదయం ప్రైవేటు వ్యక్తులను పనిలోకి తీసుకోని ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో చెత్త దిబ్బలను తరలించే పనులు చేపట్టారు. మున్సిపల్ కార్మిక సంఘం నేతలు ప్రైవేటు వ్యక్తులను పనిలోకి తీసుకుంటే అంగీకరించే ప్రసక్తే లేదని కొవిడ్ కార్మికులను పనిలోకి తీసుకొని పనిచేయించుకోవాలని అడ్డగించారు. అయితే కొవిడ్ కార్మికుల కనీస డిమాండ్లు పరిష్కరించాలని గురువారం రాత్రి 7గంటలకు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు సత్యం, విజయ్‌కుమార్, సాల్మన్, రాఘవలను పిలిపించి చర్చించారు. కొవిడ్ కార్మికులకు సంవత్సరానికి 15 రోజుల సెలవులు, నూనె సబ్బులు యూనిఫాంలు అందజేయాలన్నారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ జీతం పెంపు తన పరిధిలో లేదని రాష్ట్ర అధికారులు నిర్ణయిస్తే అమలు జరుపుతామని తెలిపారు. దీంతో కార్మిక నాయకులు 95 మంది కొవిడ్‌వర్కర్లను పనిలోకి తీసుకోవడానికి అంగీకరించారు. అలాగే వాహనాలను కూడా అడ్డగించమని హామీ ఇచ్చారు. ఇంజనీరింగ్ పారిశుధ్య కార్మికులు యథాతదంగా సమ్మె కొనసాగిస్తారని తెలియజేశారు. ఈచర్చల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా సుబ్బరాయడుడు, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు బీటెక్ శివ, వెంకటేష్, గంగాధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

డబుల్ రిజిష్టర్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న భూ బాధితులు

ప్రొద్దుటూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లె పంచాయతీ మీనాపురంలో చల్లా ఎల్లమ్మఅనే మహిళ తనకు సర్వేనెంబరు 271లో 3.60 ఎకరాల భూమి ఉంటే 270లో ఆ భూమి ఉన్నట్లు పెద్ద ఖాసీం సాహెబ్ అనే వ్యక్తికి జీపీ చేయించి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆరోపించారు. 270లో ఆ భూమి పెద్ద ఖాసీం సాహెబ్ అనే వ్యక్తికి జీపీ చేయించి తద్వారా 70 మందికి ప్లాట్లు వేసి విక్రయించి సొమ్ముచేసుకొని మోసం చేశారంటూ గురువారం తహసీల్దారు గంగయ్యను ప్లాట్ల యజమానులతో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా శివచంద్రారెడ్డి మాట్లాడుతూ 271 సర్వేనెంబరులో ఉన్న 3.60 ఎకరాల భూమిని ఆమె తిరిగి 2020 మార్చి 20 న ముగ్గురు వ్యక్తులకు అక్రమంగా డబుల్ రిజిష్ట్రేషన్ చేయించిందన్నారు. 3.60 ఎకరాల్లో ప్లాట్లు వేసుకోని కొందరు ఇళ్లు కూడా నిర్మించి ఉంటే నేడు వారిపై అక్రమరిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. 70 మంది ప్లాట్ల యజమానులకుకి రాయించిన దస్తావేజుల్లో హద్దులను 271 సర్వేనెంబరులో రెవెన్యూ అధికారులు పరిశీలించి భూమి యజమాన్యాన్ని నిర్ణయించాలని కోరారు.

విద్యార్థులు బంగారు భవితకు బాటలు వేసుకోవాలి



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి ఇస్తున్న మానవత కేంద్ర కమిటీ సభ్యులు

ఎర్రగుంట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బంగారు భవితకు బాటలు వేసుకోవాలని మానవత సేవా సంస్థ కేంద్ర కమిటీ డైరక్టర్లు రాటాల గోపి, రామాంజనేయరెడ్డి, బాల ఎల్లారెడ్డిలు పేర్కొన్నారు. గురువారం ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రామాంజనేయరెడ్డి అధ్యక్షతన క్యారీర్ గైడెన్స్-మోరల్ వాల్యూస్‌పై కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా వారు చదువులో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించిన 10వ తరగతి విద్యార్థులు ఎం.సంగీత, ఎం.మణి, వి.గురుకౌషిక్‌రెడ్డి, సహాన్‌కు రూ.1000, రూ.800 ప్రోత్సాహాలను, షీల్డ్‌లను అందజేశారు. ఈకార్యక్రమంలో మండల శాఖ ఛైర్మన్ డి.రఘురామిరెడ్డి, అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి, సభ్యులు మల్లికార్జునరెడ్డి, మేడా రమేష్‌బాబు, సతీష్, శ్రీరాములు, రాజవర్ధన్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



షేక్ హసీనాకు సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న రితీష్‌రెడ్డి

అట్లూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని కాటంవారిపల్లె గ్రామానికి చెందిన షేక్ హసీనాకు బద్వేలు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి సీఎం సహాయనిధి కింద రూ.1.36లక్షల చెక్కును అందించారు. షేక్ హసీనా కుమారుడు షేక్ నాయబ్ రసూల్‌కు వెన్నపూస భాగంలో అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆసుపత్రి ఖర్చులకు గాను సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించడంపై షేక్ హసీనా కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబుకు , రితీష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బయ్యలు ఉన్నారు.

పుస్తకాలు అందక విద్యార్థుల ఇక్కట్లు

జమ్మలమడుగు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యశిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే టెస్ట్‌బుక్కులు ఇంకా పూర్తి స్థాయిలో అందలేదని పలువురు వాపోతున్నారు. కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఇంకా పుస్తకాలు అందించలేదని పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. దాదాపు నెల రోజులు దాటుతున్నా నోట్‌పుస్తకాలు అందలేదన్నారు. ఈ సమస్యపై జమ్మలమడుగు ఎంఈవో చంద్రశేఖర్‌రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు అందించామన్నారు. మండలంలో 41 ప్రైమరీ స్కూళ్లు, మూడు యూపీ స్కూళ్లు, 13 హైస్కూళ్లకు పుస్తకాలు సరఫరా చేశామన్నారు. కొత్తగా చేరిన వారికి ఇంకా ఇవ్వలేదని ప్రభుత్వం అందించిన బ్యాగులు, డిక్షనరీలు, యూనిఫాం అందించామన్నారు.